# విశాల భారతి

15-03-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 70




# ఖర్గ్‌పై అమెరికా దాడి

- ఇరాన్ వ్యూహాత్మక చమురు కేంద్రం 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా మెరుపు దాడులు
- ట్రూత్ సోషల్ వేదికగా బ్లాక్ అండ్ వైట్ వీడియో విడుదల చేసిన డొనాల్డ్ ట్రంప్
- హోర్ముజ్ జలసంధిని అడ్డుకుంటే చమురు నిల్వలను బూడిద చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ ఎగుమతుల్లో 90 శాతం వాటా ఉన్న ద్వీపంలోని సైనిక కేంద్రాలు ధ్వంసం
- అమెరికా మిత్రదేశాల ఇంధన వనరులపై ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్
- ఆరో రోజుకు చేరిన విధ్వంసం.. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సెగలు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత సాహసోపేతమైన నిర్ణయాన్ని అమలు చేశారు. ఇరాన్ చమురు ఎగుమతులకు గుండెకాయ వంటి 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా సెంట్రల్ కమాండ్ భీకర దాడులు జరిపింది.

మిగతా 2లో..



# ఇరాన్ క్షిపణుల వర్షం

సౌదీలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

యూఎస్ వాయుసేనకు చెందిన 5 కేసీ-135 విమానాలు దెబ్బతిన్నాయి

విమానాలు గ్రౌండ్‌లో ఉండగానే టార్గెట్ చేసిన ఇరాన్ సైన్యం

అమెరికా గగనతల ఆపరేషన్లకు వెన్నుముక లాంటి రీఫ్యూయలింగ్ నౌకలే లక్ష్యం

ప్రాణనష్టం జరగలేదని ధృవీకరించిన పెంటగాన్ అధికారులు



**పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పడప్పడే చల్లారేలా కనిపించడం లేదు. తాజాగా ఇరాన్ తన క్షిపణి పటిష్టతను చాటుతూ సౌదీ అరేబియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరంపై విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు అమెరికా వాయుసేనకు భారీ నష్టాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా యుద్ధ విమానాలకు గాలిలోనే ఇంధనాన్ని నింపే ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ఈ దాడిలో తీవ్రంగా దెబ్బతిన్నట్లు 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన నివేదికలో వెల్లడించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో అమెరికా వ్యూహాత్మక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.**

**విశాలభారతి, అంతర్జాతీయం:**

ఈ దాడి జరిగిన సమయంలో విమానాలన్నీ రన్‌వేపై పార్క్ చేసి ఉన్నాయని, అమెరికా అధికారులు ధృవీకరించారు. ఇరాన్ ప్రయోగించిన ఖచ్చితత్వంతో కూడిన క్షిపణులు నేరుగా ఈ విమానాలను తాకాయి. అయితే, ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలు కోల్పోకపోవడం అమెరికాకు కలిసొచ్చిన అంశం. దెబ్బతిన్న విమానాలు పూర్తిగా ధ్వంసం కాలేదని, వాటికి ప్రస్తుతం మరమ్మతులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ, అత్యంత కీలకమైన రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు ఒకేసారి ఐదు దెబ్బతినడం అనేది అమెరికా వాయుసేనకు పెను సవాలుగా మారింది. ఎందుకంటే యుద్ధ విమానాలు సుదూర లక్ష్యాలను చేరుకోవాలంటే ఈ ట్యాంకర్లే కీలకం. ఇరాన్ ఈ దాడులను అత్యంత పక్కా ప్రణాళికతో చేపట్టినట్లు కనిపిస్తోంది. యుద్ధ విమానాలను కూల్చడం కంటే, వాటికి ప్రాణాధారమైన ఇంధన సరఫరా వ్యవస్థను దెబ్బతీయడం ద్వారా అమెరికా గగనతల ఆపరేషన్లను స్తంభింపజేయవచ్చని ఇరాన్ భావిస్తోంది. గత కొన్ని రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య ప్రత్యక్ష యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, సౌదీ వంటి మిత్రదేశాల గడ్డపై ఉన్న యూఎస్ స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఈ దాడుల వల్ల గల్ఫ్ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు మరోసారి ప్రశ్నార్థకంగా మారాయి. మరోవైపు, ఇరాక్‌లో జరిగిన మరో ఘటన అమెరికాను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

మిగతా 2లో..


విశాల భారతి

తెలుగు దిన పత్రిక

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో పనిచేయుటకు అనుభవం ఆసక్తి ఉన్న జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు,మండల విలేకరులు కావలెను.
కొత్తవారికికూడా అవకాశం కలదు..

పనిచేయు మండలాలు:

ఖమ్మం జిల్లా : జిల్లా స్టాఫర్, క్రైమ్,ఖమ్మం రూరల్,మండలాలు తిరుమలయపాలెం ,వైరా, కొణిజర్ల, ముదిగొండ, రఘునాథపాలెం, ఎర్రుపాలెం,మధిర, తల్లాడ, బోనకల్లు, చింతకాని, కామేపల్లి, కల్లూరు పెనుబల్లి, వేంసూరు,ఏన్కూరు మండల విలేకర్లు కావలెను.

కొత్తగూడెం జిల్లాలో: కొత్తగూడెం,కొత్తగూడెం టౌన్, సింగరేణి, క్రైమ్, జూలూరుపాడు, సుజాత నగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి,టేకులపల్లి,ఇల్లందు చంద్రుగొండ,అన్నపూరెడ్డిపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, చర్ల, పినపాక.

పైన తెలిపిన మండలాల్లో నిజాన్ని నిర్భయంగా రాసే దమ్మున్న ఆసక్తి గల విలేకర్లు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్:
93989 08071

వివరాల కోసం: epaper.vishalabharati.com


## కాంగ్రెస్ మూసీని మురికి కూపంగా మార్చింది

- గ్యారంటీలకు నిధులు లేవు కానీ.. మూసీకి రూ.1.5 లక్షల కోట్లా
- కేసీఆర్ 'నిర్మాణం' గురించి చెబితే.. రేవంత్ 'విధ్వంసం' కోరుతున్నారు
- మూసీని మురికికూపంగా మార్చిన కాంగ్రెస్.. ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- ఒక్క ఇల్లు కూల్చకుండానే బీఆర్ఎస్ హయాంలో పనులు చేపట్టాం.
- రేవంత్ సహా మంత్రుల ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవా
- పేదల కడుపు కొట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర ఇది

03



## పెళ్లి వద్దన్నందుకు..
# ఎయిడ్స్ ఇంజెక్షన్!

నిశ్చితార్థం రద్దు చేసుకుందని ఘాతుకం

యువతికి బలవంతంగా ఎయిడ్స్ రక్తంతో ఇంజెక్షన్

నిందితుడి కుటుంబానికీ గతంలోనే వ్యాధి నిర్ధారణ

నిరాకరించిందని ప్రాణాపాయంలోకి నెట్టిన మనోహర్

కామారెడ్డి జిల్లా పోచారంలో వెలుగుచూసిన ఘటన

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సినిమా కల్పితం కావచ్చు కానీ, కొన్నిసార్లు వాస్తవ పరిస్థితులు అంతకంటే భయానకంగా ఉంటాయని కామారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు వెండితెరపై 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంలో తండ్రి తన కూతురికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చే సీన్ చూసి జనం వణికిపోయారు. కానీ ఇప్పుడు అచ్చం అలాంటి కిరాతకమే సామాన్య మానవ సంబంధాల మధ్య చోటుచేసుకంది. ప్రేమ పేరుతోనో, పెళ్లి పేరుతోనో నచ్చిన వారు దక్కకపోతే వారి జీవితాలను నాశనం చేయాలనే పైశాచికత్వం పెచ్చరిల్లుతోంది. కామారెడ్డి జిల్లా పోచారానికి చెందిన ఒక యువకుడు తనలోని వికృత ఆలోచనలతో ఒక నిండు ప్రాణాన్ని, ఆ కుటుంబం యొక్క భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేశాడు. కేవలం పెళ్లి వద్దన్నదన్న కక్షతో ఆ యువతికి ప్రాణాంతకమైన వైరస్‌ను ఎక్కించడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈ విషాద గాథ వివరాల్లోకి వెళ్తే, పోచారం గ్రామానికి చెందిన మనోహర్ అనే యువకుడికి, అదే ప్రాంతానికి చెందిన ఒక యువతికి పెద్దలు పెళ్లి నిశ్చయించారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న

మిగతా 2లో..



## హర్మూజ్ దాటిన భారత్ నౌకలు

- నిప్పుల కొలిమిగా మారిన హర్మూజ్ జలసంధిని దాటిన భారత ఎల్పీజీ నౌకలు
- ప్రధాని మోదీ, జైశంకర్ జరిపిన మెరుపు దౌత్యంతో మెత్తబడ్డ ఇరాన్
- సురక్షిత జలాల్లోకి ప్రవేశించిన 'శివాలిక్', 'నందాదేవి' ట్యాంకర్లు
- ఇంధన సంక్షోభం నుంచి ఊపిరి పీల్చుకోనున్న దేశీయ మార్కెట్

03

## కాంగ్రెస్‌ది బాధ్యతారాహిత్యం

- అంతర్జాతీయ శక్తుల కనుసన్నల్లో కాంగ్రెస్ నడుస్తోందని ప్రధాని మోదీ ఆరోపణ
- ప్రపంచ యుద్ధ వాతావరణం ఉన్నా భారత్‌పై ప్రభావం పడకుండా చూస్తున్నాం
- స్వాతంత్ర్య సమయంలో బరాక్ వ్యాలీకి సముద్ర మార్గం లేకుండా అడ్డుకుందని విమర్శ
- ఈశాన్య రాష్ట్రాలను దశాబ్దాల పాటు కాంగ్రెస్ గాలికి వదిలేసిందని మండిపాటు
- రూ. 22,860 కోట్లతో షిల్లాంగ్-సిల్చార్ గ్రీన్ ఫీల్డ్ కారిడార్‌కు భూమి పూజ
- ఈశాన్యంలో ఉగ్రవాదం పోయి.. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వెల్లడి

03



## గ్యాస్ కొరతను సృష్టిస్తున్నారు



- దేశంలో గ్యాస్ కొరత లేదని రాంచందర్ రావు స్పష్టీకరణ
- కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని విమర్శ
- మోదీ హయాంలోనే గ్యాస్ ధరలు తగ్గాయని వెల్లడి

02

# మూసీలో మంచినీరు పారేలా చేస్తాం

## రూ.10 కోట్లతో చతుర్భుజి రహదారి పనుల ప్రారంభం

- విజయవాడ రహదారికి కోకాపేట స్థాయి క్రేజ్
- రూ.940 కోట్లతో భారీ డబుల్ డెక్కర్ కారిడార్
- ఒకేచోట మెట్రో రైలు, నేషనల్ హైవే, అండర్ పాస్
- మూసీ ప్రక్షాళన ద్వారా ఆరోగ్య కష్టాలకు శాశ్వత పరిష్కారం
- అభివృద్ధి పనులను రాజకీయం చేయొద్దని మంత్రి హితవు

05



## హైదరాబాద్‌కు 'రైలు' హారం




- రీజినల్ రింగ్ రైలు డీపీఆర్ సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రీజినల్ రింగ్ రోడ్డు వెంటే సమాంతరంగా రైలు మార్గం అలైన్‌మెంట్
- భూసేకరణ భారం తగ్గించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మార్పులు

04

# విస్తృత పర్యటన చేసిన ఎమ్మెల్యే జారె



**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా రెడ్డిగూడెం గ్రామపంచాయతీలో నివసిస్తున్న కొండరెడ్డి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకుఅందజేశారు.అనంతరం ఆసుపాక, కన్నాయిగూడెం పంచాయతీల పరిధిలోని చెన్నాపురం గ్రామాలలో ఇటీవల నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.పేద ప్రజలకు గృహసౌకర్యం కల్పించడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నారాయణపురం, కోయరంగాపురం, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, తిరుమలకుంట, మామిళ్లవారిగూడెం, ఊట్లపల్లి గ్రామపంచాయతీలలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నిర్మించబోయే సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. కన్నాపురం గ్రామం నందు విమానంలో ఉన్న విద్యుత్ సబ్స్టేషన్ పనులను పరిశీలించారు. వినాయకపురం గ్రామంలో చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పరిసరాలలో నూతన ట్రాన్స్ఫార్మర్ ప్రారంభిన అనంతరం భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన తరువాత ఆలయ ప్రాంగణంలో మండల అధికారులతో మండల అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు త్వరలో జరగనున్న చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ఇదే సందర్భంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న పలు శుభకార్యాలలో పాల్గొని ఆశీర్వదించారు.

# ఎమ్మెల్యే పాయంకు సీతారామకెనల్ రైతులు వినతి పత్రం



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వేదికగా సీతారామ కెనాల్ ఎల్ 2 ఎడమవైపు ఉపకాలువను తక్షణమే నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు,లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు దోమల వాగు చెరువును మినీ రిజర్వాయర్ గా తీర్చిదిద్దాలని తెలిపారు. సీతారామ కాలువ ఎల్ 2 వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని దాని యొక్క వెడల్పు 168 అడుగులు ఉంటుందని అధికారులు తెలిపారని దానివల్ల సుమారు 300 ఎకరాలు సాగుభూమి కోల్పోతున్నట్లు రైతులు వాపోయారు. లక్ష్మీపురం గ్రామపంచాయతీ పినపాక నియోజకవర్గం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ గా ఏర్పడి అత్యధికంగా ఇండస్ట్రియల్ వస్తున్న క్రమంలో వేలాదిమంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఈ యొక్క కాలువ తీసినట్లైతే ఇండస్ట్రియల్ కారిడార్ గా ఉన్న లక్ష్మీపురం ఎన్ పి.రెడ్డిపాలెం కు ఎక్కువ నష్టం జరిగే ప్రమాదం ఉన్నట్టు సూచించారు. లక్ష్మీపురం పరిధిలో ఉన్న సుమారు 200 ఎకరాల పారిశ్రామిక భూమి ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. దీని ఫలితంగా పరిశ్రమలో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఉపాధికి నష్టం వాటిల్లె ప్రమాదం ఉందని అన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించి రైతుల భూములు అన్యక్రాంతం కాకుండా చూస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# గ్యాస్ కొరతను సృష్టిస్తున్నారు

- దేశంలో గ్యాస్ కొరత లేదని రాంచందర్ రావు స్పష్టీకరణ
- కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని విమర్శ
- మోదీ హయాంలోనే గ్యాస్ ధరలు తగ్గాయని వెల్లడి
- మూసీ ప్రక్షాళనకు ఓకే.. పేదల ఇళ్ల కూల్చివేతకు నో
- బఫర్ జోన్ పేరుతో భూసేకరణపై తీవ్ర అభ్యంతరం
- సబర్మతి తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి సూచన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం గ్యాస్ కొరత, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అంశాలు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న గ్యాస్ కొరత వార్తలను ఆయన కొట్టిపారేస్తూ, అసలు దేశంలో ఇంధన సంక్షోభమే లేదని గంటాపథంగా చెప్పారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం కావాలనే కృత్రిమ కొరతను సృష్టించి సామాన్యులను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తుచేశారు. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ మేఘాలు కమ్ముకుని ఉన్నా, భారత్‌లో ధరలు అదుపులో ఉండటం ప్రధాని మోదీ దార్శనికతకు నిదర్శనమని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఉక్రెయిన్, రష్యా వంటి దేశాల మధ్య యుద్ధ పరిస్థితుల వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, కానీ మన దేశంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం చొరవతో సామాన్యుడిపై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారని కొనియాడారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ చాలా మెరుగైన స్థితిలో ఉందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గతంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,200 వరకు వెళ్లిందని, దాన్ని రూ. 900లకు తగ్గించి కోట్లాది మందికి ఉపశమనం కలిగించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంతో పాటు, సబ్సిడీలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేర్చడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేశామని చెప్పారు. ధరల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా, కేంద్రం మాత్రం తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తోందని విమర్శించారు. గ్యాస్ ధరల తగ్గింపు వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని, ఈ వాస్తవాన్ని విస్మరించి విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

ఇక హైదరాబాద్ ప్రజల జీవనాడి అయిన మూసీ నది ప్రక్షాళన విషయంపై బీజేపీ వైఖరిని రాంచందర్ రావు స్పష్టంగా వివరించారు. నదిని శుద్ధి చేయాలనే ఆలోచనను తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని, కానీ ఆ ప్రాజెక్టు అమలు చేసే విధానం మాత్రం సరిగ్గా లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పేరుతో దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అభివృద్ధి అనేది ప్రజల ప్రయోజనం కోసం ఉండాలి తప్ప, వారిని నిరాశ్రయులను చేసేలా ఉండకూడదని ఆయన సూచించారు. పేదల పొట్ట కొట్టి నదిని అందంగా తీర్చిదిద్దడం ఏ రకమైన ప్రగతి అని ఆయన ప్రశ్నించారు.

మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని రాంచందర్ రావు అభిప్రాయపడ్డారు. నిబంధనల పేరుతో భూసేకరణ చేస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం ఏకంగా 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇది పునరుజ్జీవన ప్రాజెక్టా లేక రియల్ ఎస్టేట్ వ్యాపారమా అనే అనుమానం కలుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల వేల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో విజయవంతంగా పూర్తి చేసిన సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రభుత్వం ఒకసారి గమనించాలని రాంచందర్ రావు సూచించారు. అక్కడ ఎవరికీ నష్టం కలగకుండా, అందరినీ ఒప్పించి మెప్పించి నదిని ఏ విధంగా సుందరీకరించారో నేర్చుకోవాలన్నారు. అక్కడ అమలు చేసిన పద్ధతులను ఇక్కడ ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, బలవంతపు భూసేకరణ ప్రజాస్వామ్య విరుద్ధమని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ కోసం సాంకేతిక పరమైన పరిష్కారాలు వెతకాలి తప్ప, పేదల గూడు చెడగొట్టడం పరిష్కారం కాదని ఆయన హితవు పలికారు.

మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారిలో చాలా మంది కష్టజీవులేనని, వారిని ఖాళీ చేయించడం వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు ప్రణాళిక లేకుండా బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడం అరాచక పాలనకు నిదర్శనమని విమర్శించారు. బాధితులకు సరైన ప్రత్యామ్నాయం చూపకుండా, వారిని భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రాంచందర్ రావు హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందని ప్రచారం చేస్తూ, ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ తప్పును కేంద్రంపైకి నెట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. గ్యాస్ పంపిణీ వ్యవస్థలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిచేయాల్సింది పోయి, లేని కొరతను ఉన్నట్లుగా చూపడం రాజకీయ దిగజారుడుతనమేనని మండిపడ్డారు. సామాన్యుల జీవితాలతో ఆటలాడుకోవడం మానుకుని, ప్రజలకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు విషయంలోనైనా, ధరల విషయంలోనైనా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. బీజేపీ ఎప్పుడూ అభివృద్ధికి అనుకూలంగానే ఉంటుందని, కానీ అది వినాశనానికి దారితీయకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులతో చర్చలు జరిపి, వారి అనుమతితోనే పనులు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పారదర్శకత లేని ప్రాజెక్టుల వల్ల ప్రజాధనం వృథా అవ్వడమే కాకుండా, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని హెచ్చరించారు. మొత్తానికి గ్యాస్ ధరలు , మూసీ ప్రాజెక్టుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచాయి. కేంద్ర పథకాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరిస్తూనే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. భవిష్యత్తులో బీజేపీ ఈ రెండు అంశాలపై పోరాటాలను మరింత ఉధృతం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అటు గ్యాస్ సరఫరాను పర్యవేక్షించడం, ఇటు మూసీ బాధితులకు అండగా నిలవడమే తమ తక్షణ కర్తవ్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ రాజకీయ యుద్ధంలో చివరకు ప్రజల ప్రయోజనాలు ఎలా ప్రభావితం అవుతాయో వేచి చూడాలి.

# ఇరాన్ క్షిపణుల వర్షం

**మొదటిపేజీ తరువాయి**

ఇరాక్‌లో ఒక కేసీ 135 రీఫ్యూయలింగ్ విమానం కుప్పకూలిన ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు సౌదీలో ఐదు విమానాలు దెబ్బతినడం యూఎస్ సెంట్రల్ కమాండ్‌కు గట్టి ఎదురుదెబ్బ. వరుసగా విమానాలను కోల్పోతుండటం వల్ల అమెరికా తన యుద్ధ విమానాలను గాలిలో ఎంతసేపు ఉంచగలదనే దానిపై సందిగ్ధత నెలకొంది. ఈ 'రీఫ్యూయలింగ్' సంక్షోభం యుద్ధ గతిని మార్చే ప్రమాదం ఉందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో తన ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఇరాన్ చేస్తున్న ఈ ప్రయత్నాలను అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి తర్వాత ఇరాన్ సైన్యం మరింత ఉగ్రరూపం దాల్చింది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ దళాలు, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశాలపై కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. సౌదీ అరేబియాలోని స్థావరంపై దాడి జరగడం ద్వారా, ఇరాన్ తన పొరుగు దేశాలకు కూడా గట్టి హెచ్చరిక పంపింది. అమెరికాకు సహకరిస్తే ఇటువంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనేది ఇరాన్ పరోక్ష సందేశం. సాంకేతికంగా చూస్తే, కేసీ 135 విమానాలు దశాబ్దాలుగా అమెరికా వాయుసేనకు వెన్నుముకగా ఉన్నాయి. ఇవి గాలిలో వేలాది గాలన్ల ఇంధనాన్ని యుద్ధ విమానాలకు బదిలీ చేయగలవు. ఇవి లేకపోతే అమెరికా యుద్ధ విమానాలు పరిమిత దూరం మాత్రమే ప్రయాణించగలవు. ఇరాన్ సరిగ్గా ఈ బలహీనతను గుర్తించి దాడి చేసింది. ప్రస్తుతానికి దెబ్బతిన్న విమానాలను యుద్ధ ప్రాతిపదికన బాగు చేస్తున్నప్పటికీ, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా గగనతల ఆధిపత్యం కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. యుద్ధం ఇలాగే కొనసాగితే అమెరికా మరిన్ని అదనపు దళాలను ఈ ప్రాంతానికి తరలించాల్సి వస్తుంది.



ఈ క్షిపణి దాడుల నేపథ్యంలో, సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు తమ వైమానిక రక్షణ వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకుంటున్నాయి. ఇరాన్ క్షిపణులు ఏ స్థాయిలో అమెరికా స్థావరాలను చీల్చుకుంటూ వస్తున్నాయో చూస్తుంటే, ప్యాట్రియాట్ వంటి రక్షణ వ్యవస్థల వైఫల్యంపై కూడా చర్చ జరుగుతోంది. అమెరికాకు చెందిన అధునాతన నిఘా వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు వాటి కళ్లుగప్పి దాడులు చేయడం పెంటగాన్‌ను కలవరపెడుతోంది. ఇది కేవలం ఒక దాడి మాత్రమే కాదు, భవిష్యత్తులో జరగబోయే భారీ యుద్ధానికి ఇది నాంది కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిణామాలపై స్పందించేందుకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రస్తుతానికి నిరాకరించింది. అయితే, ఇరాన్ తన 'దోమల దండు' డ్రోన్లు, ఖచ్చితత్వంతో కూడిన మిసైళ్లతో గల్ఫ్ అంతటా అలజడి సృష్టిస్తోంది. ఇజ్రాయెల్ ఇప్పటికే ఇరాన్‌పై దాడులు తీవ్రం చేయగా, దానికి ప్రతిగా ఇరాన్ అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటోంది. ఈ పరస్పర దాడుల వల్ల ప్రపంచ చమురు మార్కెట్ కూడా అతలాకుతలమవుతోంది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ బెదిరింపులు ఇప్పటికే చమురు ధరలను ఆకాశానికి చేర్చాయి. ఇప్పుడు రీఫ్యూయలింగ్ విమానాలపై దాడి జరగడం మంటల్లో ఆజ్యం పోసినట్లయింది.

సామాన్యుల కోణంలో చూస్తే, ఈ యుద్ధం పశ్చిమాసియాలో నివసిస్తున్న లక్షలాది మంది వలసదారులపై, ముఖ్యంగా భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే ఒమన్‌లో ఇద్దరు భారతీయులు మరణించగా, గల్ఫ్ దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. యుద్ధం ఇలాగే ముదిరితే మరిన్ని ఆస్తి, ప్రాణ నష్టాలు తప్పవు. అమెరికా ప్రతీకార చర్యగా ఇరాన్ అణు కేంద్రాలపై లేదా చమురు క్షేత్రాలపై దాడి చేస్తే, పరిస్థితి అదుపు తప్పుతుంది. అగ్రరాజ్యం తన 'మినిట్‌మ్యాన్ 3' పరీక్షతో ఇప్పటికే హెచ్చరికలు పంపిన నేపథ్యంలో, ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఇటువంటి దాడులకు పాల్పడటం సాహసోపేతమే అని చెప్పాలి.

మొత్తానికి, ప్రిన్స్ సుల్తాన్ బేస్‌పై జరిగిన ఈ దాడి పశ్చిమాసియాలో కొత్త సమీకరణాలకు తెరలేపింది. ఇరాన్ దగ్గర ఉన్న క్షిపణి సాంకేతికత అమెరికాకు సవాలుగా నిలుస్తోంది. అగ్రరాజ్యం ఈ నష్టాన్ని ఎలా పూడ్చుకుంటుంది? ఇరాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, గల్ఫ్ గడ్డపై జరుగుతున్న ప్రతి పేలుడు ప్రపంచ శాంతిని ప్రశ్నార్థకం చేస్తోంది. శాంతి చర్చలు జరిగే వరకు ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

# ఖర్గ్‌పై అమెరికా దాడి

**మొదటిపేజీ తరువాయి**

తన ఆదేశాల మేరకే ఈ ఆపరేషన్ జరిగినట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించడం గమనార్హం. యుద్ధ చరిత్రలోనే ఇవి అత్యంత శక్తివంతమైన దాడులుగా ఆయన అభివర్ణించారు. ఈ మెరుపు దాడితో ఇరాన్ సైనిక పటిష్టత ఒక్కసారిగా కుప్పకూలిందని, ద్వీపంలోని ప్రధాన రక్షణ కేంద్రాలు తునాతునకలయ్యాయని శ్వేతసౌధం వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన దృశ్యాలను ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా పంచుకోవడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఎటువంటి క్యాప్షన్ లేకుండా కేవలం 'బ్లాక్ అండ్ వైట్' వీడియోను విడుదల చేయడం ద్వారా తన వ్యూహాత్మక గంభీరతను చాటుకున్నారు. ఆ వీడియోలో క్షిపణుల తాకిడికి సైనిక భవనాలు పేలిపోతున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక దేశ అధ్యక్షుడే స్వయంగా యుద్ధ విమానాల బాంబు దాడుల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం నేటి తరం యుద్ధ తంత్రానికి నిదర్శనం. ఇది కేవలం ఒక దాడి మాత్రమే కాదు, ఇరాన్ నాయకత్వానికి అమెరికా పంపిన ఒక స్పష్టమైన హెచ్చరికగా విశ్లేషకులు భావిస్తున్నారు.



అమెరికా తన దాడుల్లో ఆచితూచి అడుగులు వేస్తోంది. ఖర్గ్ ఐలాండ్‌లోని సైనిక కేంద్రాలను ధ్వంసం చేసినప్పటికీ, అక్కడి చమురు మౌలిక సదుపాయాల జోలికి ప్రస్తుతానికి వెళ్లలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచ చమురు సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తూనే, ఇరాన్ రక్షణ కవచాన్ని ఛేధించడమే అమెరికా ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, ఇరాన్ గనుక అతిగా ప్రవర్తిస్తే అసలు సినిమా ముందుందని ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు. చమురు బావులను టార్గెట్ చేయకపోవడం వెనుక ప్రపంచ దేశాల ఆర్థిక ప్రయోజనాలు, పెరుగుతున్న ఇంధన ధరల భయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ఏమాత్రం సహించడం లేదు. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ఈ జలసంధిని అడ్డుకోవాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. నౌకల స్వేచ్ఛా ప్రయాణానికి ఆటంకం కలిగిస్తే, ఖర్గ్ ఐలాండ్‌లో మిగిలి ఉన్న చమురు మౌలిక సదుపాయాలను కూడా నేలమట్టం చేస్తామని ఆయన అల్టిమేటం జారీ చేశారు. ఇరాన్ తన పౌరుషం చూపే క్రమంలో సముద్ర మార్గాలను మూసివేయాలని చూస్తే, అది ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే ఆఖరి రోజవుతుందని అమెరికా తన మాటలతోనే స్పష్టం చేసింది.

ఖర్గ్ ఐలాండ్ ప్రాముఖ్యత ఇరాన్‌కు ప్రాణవాయువు వంటిది. ఇరాన్ ఎగుమతి చేసే మొత్తం చమురులో 90 శాతం ఒక్క ఈ ద్వీపం నుంచే సరఫరా అవుతుంది. అటువంటి కీలక ప్రాంతంపై అమెరికా బాంబుల వర్షం కురిపించడంతో ఇరాన్ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతింది. రక్షణ వ్యవస్థలు ధ్వంసం కావడంతో చమురు టెర్మినల్స్ ఇప్పుడు అమెరికా క్షిపణుల నీడలో ఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఉత్కంఠ ఇరాన్ వ్యాప్తంగా నెలకొంది. తమ జీవనాధారమైన చమురు బావులను కాపాడుకోవడం ఇప్పుడు ఇరాన్ ముందున్న అతిపెద్ద సవాలుగా మారింది.

ఈ దాడులపై ఇరాన్ మిలటరీ హెడ్‌క్వార్టర్స్ అత్యంత తీవ్రంగా స్పందించింది. అమెరికా దాడులను కేవలం ఒక దేశంపై జరిగిన చర్యగా కాకుండా, మొత్తం ఇస్లామిక్ విప్లవానికి జరిగిన అవమానంగా అభివర్ణించింది. తమ ఇంధన వనరులపై దాడులు కొనసాగితే, అమెరికాకు సహకరిస్తున్న ఇతర మధ్యప్రాచ్య దేశాల చమురు మౌలిక సదుపాయాలను బూడిద చేస్తామని ప్రతీకార హెచ్చరికలు జారీ చేసింది. అంటే, ఈ యుద్ధం కేవలం అమెరికాఇరాన్ మధ్యే కాకుండా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాల వైపు కూడా మళ్ళే ప్రమాదం ఉంది. ఇరాన్ తన వద్ద ఉన్న డ్రోన్లు మరియు క్షిపణులతో పొరుగు దేశాల చమురు బావులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. గల్ఫ్ ప్రాంతంలోని చమురు క్షేత్రాలపై ఇరాన్ కన్నెర్ర చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల సెగలు మొదలయ్యాయి. ఒకవేళ ఇరాన్ నిజంగానే ప్రతీకార దాడులకు దిగితే, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. యుద్ధం ఆరో రోజుకు చేరడంతో వాణిజ్య నౌకల ప్రయాణాలు నిలిచిపోయాయి. షిప్పింగ్ కంపెనీలు తమ నౌకలను సురక్షిత ప్రాంతాలకు మళ్లించడంతో సరఫరా గొలుసు దెబ్బతింది. ఇది కేవలం యుద్ధం మాత్రమే కాదు, రాబోయే ప్రపంచ ఆర్థిక మాంద్యానికి సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ సైనిక స్థావరాలపై జరిగిన దాడులు ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. ఇజ్రాయెల్ ఇప్పటికే టెహ్రాన్ నగరాన్ని తన క్షిపణులతో ముంచెత్తుతుండగా, ఇప్పుడు అమెరికా నేరుగా రంగంలోకి దిగడం యుద్ధ పరిణామాలను మార్చేసింది. పశ్చిమాసియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అగ్రరాజ్యం తన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. ఖర్గ్ ఐలాండ్‌పై దాడి కేవలం ఒక ఆరంభం మాత్రమేనని, ఇరాన్ తన తీరు మార్చుకోకపోతే దేశం మొత్తం ఇంధనం లేక అంధకారంలోకి వెళ్లక తప్పదని అమెరికా రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అటు సుప్రీం లీడర్ ఖమేనీ మృతి, ఇటు వ్యూహాత్మక కేంద్రాలపై దాడులతో ఇరాన్ గందరగోళంలో పడింది. నేటి తరం యుద్ధాలు కేవలం తుపాకులతోనే కాకుండా సోషల్ మీడియా వేదికగా కూడా జరుగుతున్నాయని ట్రంప్ వీడియో విడుదల స్పష్టం చేస్తోంది. యుద్ధ భూమిలోని దృశ్యాలు క్షణాల్లో ప్రపంచానికి చేరడం వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయి. ఇరాన్ తన దేశాభిమానాన్ని చాటుకుంటూ అమెరికా బేస్‌లపై దాడులు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా, అగ్రరాజ్యం వేస్తున్న ఎత్తుగడలకు ఆ దేశం విలవిల్లాడుతోంది.

# పెళ్లి వద్దన్నందుకు.. ఎయిడ్స్ ఇంజెక్షన్!

**మొదటిపేజీ తరువాయి**

సమయంలో ఆ యువతికి ఒక చేదు నిజం తెలిసింది. తనకు భర్త కాబోయే మనోహర్ మాత్రమే కాదు, అతని తల్లిదండ్రులు కూడా ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారనే విషయం బయటపడింది. ఏ ఆడపిల్ల అయినా తన జీవితం సాఫీగా సాగాలని కోరుకుంటుంది తప్ప, తెలిసి తెలిసి మృత్యువు ఒడిలోకి వెళ్లాలని అనుకోదు. అందుకే ఆ యువతి ధైర్యంగా తన నిర్ణయాన్ని ప్రకటించింది. తనకు ఈ సంబంధం వద్దని, మనోహర్‌ను పెళ్లి చేసుకోనని స్పష్టంగా చెప్పేసింది. ఈ నిర్ణయమే ఆ యువకుడిలో పగను పెంచింది. సాధారణంగా పెళ్లి సంబంధం కుదరకపోతే మరొక దారి చూసుకోవడం మనుషుల లక్షణం. కానీ మనోహర్ మాత్రం తన వైఫల్యాన్ని తట్టుకోలేకపోయాడు. ఆమె తనను వద్దనుకుంది కాబట్టి, ఆమెను ఎవరూ చేసుకోకూడదనే కుట్రకు తెరలేపాడు. ఈ క్రమంలోనే ఈ నెల 11వ తేదీన ఆ యువతి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమెతో గొడవకు దిగి, తనను పెళ్లి చేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి తెచ్చాడు. ప్రాణాపాయం ఉందని తెలిసినా పెళ్లికి ఎలా ఒప్పుకుంటుందని ఆమె తిరస్కరించడంతో, మనోహర్ తన జేబులో దాచుకున్న ఒక భయంకరమైన అస్త్రాన్ని బయటకు తీశాడు. తన రక్తంతో నింపిన ఒక సిరంజీని ఆ యువతికి బలవంతంగా ఇంజెక్షన్ చేశాడు. అది కేవలం ఎర్రటి ద్రవం కాదు, ఆమె జీవితాన్ని చిన్నాభిన్నం చేసే విషం అని తెలిసేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఈ ఘటన జరిగిన తీరు చూస్తుంటే ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని స్పష్టమవుతోంది.




నిందితుడు మనోహర్ తన శరీరంలోని ఎయిడ్స్ రక్తాన్ని సిరంజీలోకి ఎక్కించుకుని మరీ ఆ యువతి వద్దకు వెళ్లాడు. పెళ్లికి ఒప్పుకోకపోతే ఆమెను శారీరక రోగిగా మార్చాలనే ఉద్దేశంతోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఎయిడ్స్ వంటి వ్యాధి సోకితే సమాజం చూసే చూపు ఎలా ఉంటుందో, బాధితురాలు ఎంత మానసిక వేదనకు గురవుతుందో తెలిసి కూడా అంతటి దారుణానికి పాల్పడటం గమనార్హం. కేవలం స్వార్థం కోసం ఒక నిండు జీవితాన్ని బలిపీఠం మీద ఉంచిన మనోహర్ చర్యపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ యువతికి జరిగిన ఈ అన్యాయం వింటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది.

ప్రస్తుతం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో నిందితుడికి, అతని కుటుంబ సభ్యులకు ఎయిడ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. చట్టపరంగా ఇటువంటి నేరాలకు కఠిన శిక్షలు పడతాయని తెలిసినా, ఆ యువకుడు ఏమాత్రం భయం లేకుండా వ్యవహరించడం చూస్తుంటే నేరప్రవృత్తి ఎంతలా వేళ్లూనుకుందో అర్థమవుతోంది. పోలీసుల అదుపులో ఉన్న మనోహర్‌ను విచారిస్తున్నారు. ఇటువంటి కిరాతకుడికి కోర్టు ద్వారా అత్యంత కఠినమైన శిక్ష పడాలని, తద్వారా ఇలాంటి ఘాతుకాలకు పాల్పడాలనుకునే వారికి ఒక గుణపాఠం కావాలని బాధితురాలి బంధువులు కోరుతున్నారు. సామాజిక కోణంలో చూస్తే ఈ ఘటన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచాల్సిన నేటి కాలంలో, అదే వ్యాధిని ఒక ఆయుధంగా వాడుకోవడం అత్యంత బాధాకరం. యువతలో సహనం తగ్గిపోవడం, ప్రేమ లేదా పెళ్లి అనేవి కేవలం తమ హక్కులుగా భావించి ఎదుటివారి ఇష్టాలను గౌరవించకపోవడం ఇలాంటి నేరాలకు దారితీస్తోంది. బాధితురాలు తన ప్రాణాలను కాపాడుకోవడానికి తీసుకున్న సరైన నిర్ణయానికి బదులుగా ఆమెకు ఇటువంటి శిక్ష ఎదురుకావడం సమాజంలోని నైతిక విలువలకు పట్టిన తుప్పును సూచిస్తోంది. ఈ ఘటన కేవలం ఒక జిల్లాకో లేదా గ్రామానికో పరిమితమైనది కాదు, మహిళల భద్రత మరియు మన స్తత్వాలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. వైద్య పరంగా చూస్తే, ఎయిడ్స్ సోకిన రక్తాన్ని నేరుగా శరీరంలోకి ఎక్కించడం వల్ల బాధితురాలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది. బాధితురాలికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించడం ప్రభుత్వ బాధ్యత. వైరస్ తీవ్రతను తగ్గించే మందులు సకాలంలో ఇస్తే ఫలితం ఉండవచ్చు. కానీ ఆ యువతి పొందే మానసిక క్షోభను ఏ మందులు తగ్గించలేవు. శారీరక గాయం కంటే కూడా, తనను పెళ్లి చేసుకోవాల్సిన వాడే ఇటువంటి మోసానికి పాల్పడ్డాడనే నిజం ఆమెను మరింత కుంగదీస్తుంది. అందుకే ఆమెకు వైద్యంతో పాటు మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ కూడా చాలా అవసరం. ఈ ఉదంతం మన చుట్టూ ఉన్న వ్యక్తుల ప్రవర్తనను ఎంత జాగ్రత్తగా గమనించాలో హెచ్చరిస్తోంది. పెళ్లి సంబంధాల విషయంలో కేవలం ఆస్తులు, అంతస్తులు చూడటమే కాకుండా ఆరోగ్యం, వ్యక్తిత్వంపై కూడా ఆరా తీయడం నేటి తరం తప్పనిసరిగా చేయాల్సిన పని. ఏమాత్రం సందేహం వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పుకాదని ఈ ఘటన నిరూపిస్తోంది.

# హర్మూజ్ దాటిన భారత్ నౌకలు

- నిప్పుల కొలిమిగా మారిన హర్మూజ్ జలసంధిని దాటిన భారత ఎల్పీజీ నౌకలు
- ప్రధాని మోదీ, జైశంకర్ జరిపిన మెరుపు దౌత్యంతో మెత్తబడ్డ ఇరాన్
- సురక్షిత జలాల్లోకి ప్రవేశించిన 'శివాలిక్', 'నందాదేవి' ట్యాంకర్లు
- ఇంధన సంక్షోభం నుంచి ఊపిరి పీల్చుకోనున్న దేశీయ మార్కెట్
- యుద్ధం వల్ల నిలిచిపోయిన 28 భారతీయ నౌకలకు లైన్ క్లియర్
- అంతర్జాతీయ స్థాయిలో భారత్ దౌత్య నీతికి దక్కిన మరో విజయం



**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. క్షిపణులు, డ్రోన్ల దాడులతో ఆకాశం ఎర్రబడుతుంటే, సముద్ర గర్భం నుంచి మంటలు చెలరేగుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రస్తుతం ఒక మృత్యువలయంలా మారింది. ఎప్పుడు ఏ క్షిపణి వచ్చి నౌకలను తాకుతుందో తెలియని ఉత్కంఠ భరిత స్థితిలో, భారతీయ జెండాతో ఉన్న రెండు భారీ ఎల్పీజీ ట్యాంకర్లు సురక్షితంగా ఆ గండం గట్టెక్కడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది. యుద్ధం కారణంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్న వేళ, భారత ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ, వ్యూహాత్మక దౌత్యం వల్లనే ఈ అసాధ్యమైన ప్రయాణం సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఉత్కంఠభరిత ప్రయాణంలో ప్రధాన పాత్రధారులు 'శివాలిక్', 'నందాదేవి'. ఈ రెండు ఎల్పీజీ ట్యాంకర్లు షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందినవి. సుమారు 40,000 మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో వస్తున్న శివాలిక్, అదే స్థాయిలో సరుకును మోసుకొస్తున్న నందాదేవి ఇప్పుడు మృత్యు జలసంధిని దాటి సురక్షిత తీరానికి చేరుకున్నాయి. యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న తరుణంలో ఈ నౌకలు చిక్కుకుపోవడం వల్ల దేశంలో గ్యాస్ కొరత ఏర్పడే ప్రమాదం కనిపించింది. కానీ, భారత దౌత్యవేత్తలు రంగంలోకి దిగి చేసిన నిరంతర కృషి ఫలితంగా, ఇరాన్ ప్రభుత్వం ఈ నౌకలకు 'సేఫ్ పాసేజ్' కల్పించింది.

ఈ విజయం ఊరికే రాలేదు. దీని వెనుక ఢిల్లీ నుంచి టెహ్రాన్ వరకు సాగిన సుదీర్ఘ చర్చల పరంపర ఉంది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 12 వరకు నాలుగు సార్లు దఫదఫాలుగా చర్చలు జరిపారు. యుద్ధం కారణంగా ఇతర దేశాల నౌకలపై దాడులు జరుగుతున్నా, భారత్‌తో ఉన్న మైత్రీ సంబంధాల దృష్ట్యా తమ నౌకలకు రక్షణ కల్పించాలని భారత్ గట్టిగా కోరింది. జైశంకర్ తనదైన శైలిలో ఇరాన్ నాయకత్వాన్ని ఒప్పించడంలో కీలక పాత్ర పోషించగా, ఇది భారత విదేశాంగ విధానం యొక్క పటిష్టతను మరోసారి నిరూపించింది. దౌత్య చర్చలు కేవలం మంత్రుల స్థాయికే పరిమితం కాలేదు. స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రంగంలోకి దిగి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్లో మాట్లాడారు. యుద్ధం వల్ల ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతినకూడదని, ముఖ్యంగా భారతీయ నౌకల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని స్పష్టం చేశారు. ప్రధాని స్థాయి నుంచి వచ్చిన అభ్యర్థనను ఇరాన్ కాదనలేకపోయింది. హర్మూజ్ జలసంధిలో భారతీయ జెండా ఉన్న నౌకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని టెహ్రాన్ హామీ ఇచ్చింది. ఈ హామీతోనే 28 భారతీయ నౌకల ప్రయాణం సులభతరమైంది.

పశ్చిమాసియా యుద్ధం వల్ల చమురు రవాణాకు ప్రధాన మార్గమైన హర్మూజ్ జలసంధి మూతపడటంతో ప్రపంచం ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఒక్క చుక్క చమురు బయటకు రాకపోయినా, ఒక గ్యాస్ ట్యాంకర్ నిలిచిపోయినా అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు ఆకాశాన్ని తాకుతాయి. భారత్ తన చమురు అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో హర్మూజ్ మూసివేత మన దేశంలో ఎల్పీజీ సంక్షోభానికి దారితీసేలా కనిపించింది. అయితే సకాలంలో భారత ప్రభుత్వం స్పందించి, ఇరాన్‌తో చర్చలు జరపడం వల్ల పెట్రోల్, గ్యాస్ ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లయింది.

శివాలిక్, నందాదేవి నౌకల ప్రయాణం కేవలం రెండు ఓడల కదలిక మాత్రమే కాదు, అది భారత నౌకాయాన రంగానికి ఒక పెద్ద ఊరట. వీటితో పాటు ఒమన్ నుంచి ఆఫ్రికాకు గ్యాసోలిన్ తీసుకెళ్తున్న 'జగ్ ప్రకాష్' అనే మరో ట్యాంకర్ కూడా హర్మూజ్ జలసంధికి తూర్పు వైపు నుంచి తన ప్రయాణాన్ని వేగవంతం చేసింది. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ఈ పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భారత నౌకలకు లభించిన ఈ సురక్షిత మార్గం వల్ల ఇతర దేశాలు కూడా ఇప్పుడు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. యుద్ధ సమయాల్లో భారత్ అనుసరించే 'న్యూట్రల్' పాలసీ ఇక్కడ బాగా పనిచేసింది. యుద్ధం ఆరో రోజుకు చేరిన తరుణంలో ఇరాన్ తన క్షిపణులతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య రగులుతున్న ఈ చిచ్చులో చమురు ట్యాంకర్లు క్షిపణుల బారిన పడకుండా ఉండటం ఒక పెద్ద సవాలు. అటువంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా భారతీయ నౌకలు సురక్షితంగా బయటపడటం అంటే అది మన దౌత్యం సాధించిన అద్భుతమే. ఇరాన్ నాయకత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడమే కాకుండా, భారత నౌకలకు ప్రత్యేకమైన రక్షణ కవచంలా నిలిచింది. దీనివల్ల గ్యాస్ సరఫరాలో ఏర్పడాల్సిన అంతరాయం తప్పింది. భారత్‌ఇరాన్ మధ్య చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ ఇరాన్‌తో స్నేహపూర్వక వైఖరినే అవలంబించింది. ఇప్పుడు ఆ స్నేహమే ఆపత్కాలంలో ఆదుకుంది. హర్మూజ్ జలసంధి అనేది ఒక సన్నని మార్గం, దీనిని ఇరాన్ పూర్తిగా నియంత్రిస్తుంది. ఒకవేళ ఇరాన్ అనుమతించకపోతే ఏ నౌక కూడా అక్కడి నుంచి కదలలేదు. అటువంటి కీలకమైన చోట భారతీయ జెండా ఉన్న నౌకలకు ప్రాధాన్యత లభించడం గమనించాల్సిన విషయం. ఇది అంతర్జాతీయ వేదికపై భారత్ యొక్క పెరుగుతున్న ప్రాబల్యానికి, పరపతికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఈ నౌకలు సురక్షిత జలాల్లోకి ప్రవేశించి భారత్ వైపు వస్తున్నాయి. వీటి రాకతో దేశీయంగా ఎల్పీజీ నిల్వలు పెరిగి, సామాన్యులపై భార పడకుండా చూసే అవకాశం ఉంది. యుద్ధం వల్ల పెరిగిన ముడి చమురు ధరల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ నౌకల ప్రయాణం ఒక కీలక మలుపు. చమురు మంత్రిత్వ శాఖ మరియు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సమన్వయంతో, నిరంతరం శాటిలైట్ ట్రాకింగ్ ద్వారా ఈ నౌకల కదలికలను గమనిస్తున్నాయి. ఏ చిన్న పొరపాటు జరిగినా అది పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉన్నందున, అత్యంత గోప్యంగా మరియు జాగ్రత్తగా ఈ ఆపరేషన్ నిర్వహించారు.

మొత్తానికి పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, భారత్ తన పౌరులనే కాకుండా తన ఆర్థిక మూలాలైన నౌకలను కూడా సురక్షితంగా కాపాడుకోగలిగింది. శివాలిక్, నందాదేవి నౌకలు భారత తీరానికి చేరుకోవడం అనేది ఒక ఉత్కంఠభరితమైన పోరాటానికి ముగింపు. ఇది కేవలం సరుకు రవాణా మాత్రమే కాదు, భారత దేశం తన అవసరాల కోసం అంతర్జాతీయ వేదికపై ఎంత పట్టుదలతో పోరాడగలదో చాటిచెప్పే సందర్భం. యుద్ధం ఇంకా కొనసాగుతున్నా, మన నౌకలు సురక్షితంగా ఉండటం దేశ ప్రజలకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

## మీడియా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- మెట్రో ఉదయం తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ :** మీడియా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కుషాయిగూడలో మెట్రో ఉదయం తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికల, మెట్రో ఉదయం టీవీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేసే మీడియా సమాజంలోని పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతోనే మీడియాకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం కృషి చేస్తున్నా మెట్రో ఉదయం దినపత్రికల కృషి వెలకట్టలేనిదన్నారు. చర్లపల్లి మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి మాజీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ మీడియాకు రాజకీయానికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయన్నారు. నగర అభివృద్ధిలో బొంతు కుటుంబంది ప్రత్యేక పాత్ర ఉందని చెప్పారు. మీడియా సహకారంతోనే రాజకీయ నాయకుల ఎదుగుదల సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, టిఆర్ పి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే జానయ్య యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుజాత, మెట్రో ఉదయం చైర్మన్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ చైర్మన్ సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ సి హెచ్. శ్రీహరి, మెట్రో ఉదయం గౌరవాధ్యక్షులు రామ్మూర్తి, భద్రయ్య చారి, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చర్లపల్లి డివిజన అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకటరెడ్డి, ది ఆదర్శ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ సంక్షోభంపై నిరసన

**ఎన్ఎస్యుఐ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్**




**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎల్పీజీ గ్యాస్ సంక్షోభం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇటీవల గ్యాస్ సిలిండర్ల కొరతతో పాటు ధరలు భారీగా పెరగడం వల్ల హాస్టల్లోని మెస్సులు, పీజీ వసతగృహాలు విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేని పరిస్థితి నెలకొన్నట్టు తెలిపారు. ఈ సమస్య కరుణంగా వేలది మంది విద్యార్థులు రోజువారి జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పట్టణాల్లో చదువుకుంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఈ పరిస్థితి వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ మెస్సులు గ్యాస్ సిలిండర్ లా కొరత కారణంగా సక్రమంగా నిర్వహించలేకపోవడం వల్ల విద్యార్థులు సరైన సమయంలో భోజనం పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఇది విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలేనని ఆయన విమర్శించారు. గ్యాస్ ధరలను నియంత్రించడంలో విఫలమవడంతో పాటు సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఉర్సు శివ, షేక్ నయీమ్, భూక్య శ్రీధర్, షేక్ షాను, రాచకొండ సాయి, సమీర్, నిఖిల్, అమ్ము, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మూసీని మురికి కూపంగా మార్చింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో మూసీ ప్రక్షాళన అంశం ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు కేవలం పేదల ఇళ్లను కూల్చడానికేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో నిర్వహించిన 'పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి నిధులు లేవని సాకులు చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మూసీ ప్రక్షాళనకు మాత్రం రూ.1.5 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నారని ఆయన నిలదీశారు. ప్రాధాన్యత లేని ప్రాజెక్టుల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్ర నిర్మాణం, అభివృద్ధి గురించి ఆలోచిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం విధ్వంసం గురించే మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీ నదిని మురికికూపంగా మార్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, ఆ పాపాలకు ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవానికి శాస్త్రీయంగా అడుగులు వేసిందని ఆయన గుర్తు చేశారు. నది శుద్ధీకరణ కోసం భారీ ఎత్తున నిధులు వెచ్చించామని, ఎక్కడా పేదల ఆస్తులకు నష్టం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద తదితరులు పాల్గొని ప్రభుత్వ తీరును నిరసించారు.

మూసీ పరివాహక ప్రాంతంలో ఏవైనా నిర్మాణాలు తొలగించాల్సి వస్తే, ఆ ప్రాజెక్టునే పక్కన పెడదామని కేసీఆర్ అన్న విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం రివర్ బెడ్ పరిధిలో ఉన్న నిర్మాణాల విషయంలో తప్ప, మిగతా నివాసాలను ముట్టవద్దని గత ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ఐదు కిలోమీటర్ల మేర పైలట్ ప్రాజెక్టును మాత్రమే చేపట్టాలని అప్పట్లో నిర్ణయించామని చెప్పారు. నాగోల్, ఉప్పల్, అంబర్‌పేట ప్రాంతాల్లో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండానే మూసీ ప్రక్షాళన పనులను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బుల్డోజర్ల సంస్కృతిని ప్రోత్సహిస్తూ సామాన్యుల గుండెల్లో గుబులు రేపుతోందని విమర్శించారు.

నగరంలో మురుగునీరు మూసీలోకి చేరకుండా రూ.4 వేల కోట్లతో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించామని కేటీఆర్ వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా మురుగునీటిని శుద్ధీకరించి నదిలోకి వదలడం వల్ల కాలుష్యాన్ని తగ్గించగలిగామని వివరించారు. ఇటువంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకుండా, కేవలం లక్షల కోట్ల అంచనాలతో సుందరీకరణ ప్రాజెక్టులు చేపట్టడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ఈ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను దాచిపెట్టి, గ్రాఫిక్స్ చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

నిబంధనల అమలులో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొడంగల్‌లోని ఆయన ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదా అని ప్రశ్నించారు. అలాగే దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఉన్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. నిబంధనలు కేవలం సామాన్య ప్రజలకే వర్తిస్తాయా లేక అధికారంలో ఉన్న నాయకులకు కూడా వర్తిస్తాయా అని సూటిగా అడిగారు. పేదల ఇళ్లను కూల్చే ముందు ప్రభుత్వం తన సొంత నేతల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. లేదంటే ఈ పోరాటాన్ని ప్రజల పక్షాన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వంలోని మంత్రులు, కీలక నేతల ఫాంహౌస్‌ల గురించి కూడా కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇల్లు ఉందని, పట్నం మహేందర్ రెడ్డి నివాసం కూడా అక్కడే ఉందని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, కేవీపీ రామచంద్రరావులకు చెందిన ఫాంహౌస్‌లు కూడా జలాశయాల పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. మరి వారిపై ఏ చర్యలు తీసుకున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార మదంతో పేదల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకోబోమని, ప్రతి బాధితుడి తరపున బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో సృష్టించిన భయాందోళనల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, ఇప్పుడు మూసీ ప్రాజెక్టుతో సామాన్యులను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే కూల్చివేతలు కాదని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమని హితవు పలికారు. ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన అభివృద్ధిని చెడగొట్టడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం గతంలో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ వంటి సంస్థలతో చర్చలు జరిగాయని, వారు శాస్త్రీయ పద్ధతులను సూచించారని కేటీఆర్ గుర్తు చేశారు. నివాస ప్రాంతాలకు ఇబ్బంది కలగకుండా కేవలం నది గర్భాన్ని ప్రక్షాళన చేయడమే తమ ఉద్దేశమని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రియల్ ఎస్టేట్ మాఫియాతో చేతులు కలిపి, నది చుట్టుపక్కల ఉన్న విలువైన భూములను స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలను తరలించి ఆ భూములను ఎవరికి కట్టబెట్టాలని చూస్తున్నారో ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. పారదర్శకత లేని ఏ ప్రాజెక్టునైనా అడ్డుకుంటామని, బాధితుల ఇళ్ల వద్ద కాపలా ఉంటామని హామీ ఇచ్చారు. పోరాటం కేవలం ఒక పార్టీది కాదని, సొంతిల్లు కోల్పోతున్న వేలాది మంది పేదల ఆవేదన అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే రాజకీయంగానే కాకుండా న్యాయపరంగా కూడా పోరాడుతామని చెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజల్లో చైతన్యం నింపుతామని, అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని గట్టిగా నిలదీస్తామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని, వారిని భయపెట్టి పరిపాలన సాగించడం అసాధ్యమని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ధైర్యంగా ఉండాలని, వారి గొంతుకగా బీఆర్ఎస్ పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

## కాంగ్రెస్‌ది బాధ్యతారాహిత్యం

**విశాలభారతి, జాతీయం:**



ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకుని, ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన ప్రస్తుత తరుణంలో భారత్ తన అభివృద్ధి పంథాను వీడకుండా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షోభాల ప్రభావం దేశ ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అసోంలోని సిల్చార్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లోనూ దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని చాటిచెప్పారు. ప్రపంచం మొత్తం అల్లకల్లోలంగా ఉన్నా, భారతీయులు కనీస ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రతి అడుగులోనూ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై మోదీ విమర్శనాస్త్రాలు సంధించారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన ప్రగతిని చూసి ఓర్వలేక కొన్ని అంతర్జాతీయ శక్తులు కుట్రలు చేస్తున్నాయని, అటువంటి శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలుబొమ్మగా మారిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో అభద్రతా భావాన్ని కల్పించి, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సింది పోయి, దేశ ప్రయోజనాలను పణంగా పెడుతూ విదేశీ శక్తుల అజెండాను అమలు చేస్తోందని ప్రధాని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు దేశం గురించి గానీ, అభివృద్ధి గురించి గానీ ఎటువంటి విజన్ లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈశాన్య రాష్ట్రాల పట్ల కాంగ్రెస్ దశాబ్దాల పాటు అనుసరించిన నిర్లక్ష్య వైఖరిని ప్రధాని ఎండగట్టారు. ముఖ్యంగా బరాక్ వ్యాలీ వైభవాన్ని కాంగ్రెస్ కాలరాసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో సరిహద్దులను నిర్ణయించే క్రమంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు వల్ల బరాక్ వ్యాలీకి సముద్ర మార్గం లేకుండా పోయిందని గుర్తు చేశారు. ఒకప్పుడు పారిశ్రామికంగా, వాణిజ్య పరంగా విరాజిల్లిన ఈ ప్రాంతాన్ని కేవలం ఒక సరిహద్దు రేఖ ద్వారా బలహీనపరిచారని విమర్శించారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నా ఈ ప్రాంతపు కనీస అవసరాలను కూడా కాంగ్రెస్ గుర్తించలేదని, ఈశాన్య భారతాన్ని కేవలం ఎన్నికల ఓట్ల కోసమే వాడుకుందని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసోం యువత భవిష్యత్తును కాంగ్రెస్ అంధకారంలోకి నెట్టిందని, వారిని హింస, ఉగ్రవాదం వైపు మళ్లించిందని ప్రధాని ఆరోపించారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో నిత్యం బాంబు దాడులు, అశాంతి నెలకొనేదని, కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితులు పూర్తిగా మారాయని పేర్కొన్నారు. నేడు ఈశాన్య యువత చేతుల్లో ఆయుధాలు లేవని, వారు అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని మోదీ సగర్వంగా ప్రకటించారు. శాంతి ఒప్పందాల ద్వారా ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని తీసుకువచ్చామని, ఇప్పుడు ఉగ్రవాదం స్థానంలో పారిశ్రామిక వృద్ధి కనిపిస్తోందని ఆయన వివరించారు.

కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే బీజేపీ పని ప్రారంభమవుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. గత పాలకులు అసాధ్యమనుకున్న పనులను తాము సుసాధ్యం చేసి చూపిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. "సబ్ కా సాత్ సబ్ కా వికాస్" మంత్రంతో ఈశాన్య భారతాన్ని దేశ అభివృద్ధికి చోదక శక్తిగా మారుస్తున్నామని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఢిల్లీకి దూరంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధికి అతివ్యాప్తి చెందుతోందని ఆయన కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా అసోం అభివృద్ధికి ప్రధాని మోదీ రూ. వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈశాన్య భారతంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యాక్సెస్‌కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ ఫోర్ లేన్ హైస్పీడ్ కారిడార్' (షిల్లాంగ్‌సిల్చార్)కు ఆయన భూమి పూజ చేశారు. సుమారు రూ. 22,860 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఈ 166 కిలోమీటర్ల రహదారి, మేఘాలయ, అసోం రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గువాహటి నుంచి సిల్చార్ మధ్య ప్రయాణ సమయం దాదాపు మూడున్నర గంటల వరకు తగ్గుతుందని, ఇది వ్యాపార వాణిజ్యాలకు కొత్త ఊపిరి పోస్తుందని చెప్పారు.

అంతేకాకుండా, సిల్చార్ నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎన్ హెచ్ 306 పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యా రంగానికి కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మోదీ తెలిపారు. వ్యవసాయ విద్య, పరిశోధనలను ప్రోత్సహించే ఉద్దేశంతో కరీంగంజ్ జిల్లాలోని పథర్‌కండిలో నూతన అగ్రికల్చర్ కాలేజీకి ఆయన పునాది రాయి వేశారు. ఈ కళాశాల ద్వారా స్థానిక యువతకు వ్యవసాయ రంగంలో నూతన మెళకువలు అందుతాయని, తద్వారా ఈ ప్రాంతం అన్నపూర్ణగా ఎదుగుతుందని ప్రధాని ఆకాంక్షించారు. అభివృద్ధి పనుల గురించి వివరిస్తూనే, కేవలం నిర్మాణాలు చేపడితే సరిపోదని, ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని మోదీ ఆకాంక్షించారు. మారుమూల గ్రామాల వరకు విద్యుత్, తాగునీరు, డిజిటల్ కనెక్టివిటీని అందిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు ఈశాన్య రాష్ట్రాన్ని అసలు పట్టించుకోని పాలకులు ఉన్నారని, ఇప్పుడు ప్రతి వారం ఒక కేంద్ర మంత్రి ఇక్కడికి వచ్చి సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని గుర్తు చేశారు. ఈ మార్పు కేవలం ప్రజలు ఇచ్చిన ఓటు బలంతోనే సాధ్యమైందని, ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ బలాన్ని ఇస్తాయని ప్రధాని మోదీ ప్రసంగించారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ అబద్ధాలు, వదంతులను ప్రచారం చేస్తోందని, కానీ అసోం ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరని ప్రధాని పేర్కొన్నారు. నన్ను దూషించడం వల్ల కాంగ్రెస్‌కు ఏమీ లభించదని, దేశ ప్రయోజనాల కోసం పనిచేయడం నేర్చుకోవాలని ఆయన సూచించారు. దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ఏ శక్తులు ప్రయత్నించినా అవి సఫలం కాబోవని హెచ్చరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే, ఆధునిక సాంకేతికతతో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెడతామని మోదీ సభాముఖంగా హామీ ఇచ్చారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**




శనివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గం స్థానిక శాసన సభ్యులు సాంబ శివరావు గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాబోయే అసెంబ్లీ సమావేశాలలో తప్పకుండా చర్చిస్తానని విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం సమస్యల వలయం గా మారిందని, పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ 9,300 కోట్లు ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహారిస్తుంది. విద్యార్థులకు పెండింగ్ లో బకాయిలు ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసిన కళాశాలల యాజమాన్యాలు వారి సర్టిఫికెట్స్ ఇచ్చే పరిస్థితి లేదని, అన్నారు. విద్యార్థులకు వారు పై చదువులు చదువుకోకుండా, ఉద్యోగాలకు వెళ్లకుండా మానసిక ఇబ్బందులకు గురైతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న విద్యా రంగ సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి 30% నిధులు అవసరం అని అన్నారు. విద్యార్థంగని రాష్ట్ర ప్రభుత్వం పెద్దపిటా వెయ్యాలని అసెంబ్లీలో విద్యార్థుల పక్షణ మాట్లాడాలని, ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధి కి కృషి చెయ్యాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో... ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ గుగులోత్ వంశీ, సంజయ్, నాయకులు రాజ్ కమల్ మహేష్, ఉదయ్, ఉమా మహేశ్వర్ రావు, పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు 'రైలు' హారం

- రీజినల్ రింగ్ రైలు డీపీఆర్ సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రీజినల్ రింగ్ రోడ్డు వెంటే సమాంతరంగా రైలు మార్గం అలైన్‌మెంట్
- భూసేకరణ భారం తగ్గించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మార్పులు
- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ అధికారిక ప్రకటన
- నీతి ఆయోగ్, ఆర్థిక శాఖల ఆమోదం తర్వాత పట్టాలెక్కనున్న మెగా ప్రాజెక్టు
- పారిశ్రామిక హబ్‌గా మారనున్న హైదరాబాద్ శివారు జిల్లాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ రవాణా ముఖచిత్రాన్ని మార్చేయడమే కాకుండా, హైదరాబాద్ మహానగర విస్తరణకు గుండెకాయలా మారనున్న 'రీజినల్ రింగ్ రైలు' ప్రాజెక్టులో ఎట్టకేలకు ఒక కీలకమైన అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 'డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్' సిద్ధం చేసేందుకు ప్రాథమిక సర్వే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ లేఖ రాశారు. దీనితో గత కొంతకాలంగా అనిశ్చితిలో ఉన్న ఈ మెగా ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయినట్లయింది. ఈ పరిణామం రాష్ట్రంలోని రవాణా రంగంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన సూచనలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం విశేషం. గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డుకు సుమారు 10 నుంచి 11 కిలోమీటర్ల దూరంలో రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉంది. అయితే దీనివల్ల రోడ్డుకు ఒకచోట, రైలు మార్గానికి మరోచోట భూసేకరణ చేయాల్సి రావడం ప్రభుత్వానికి తలకు మించిన భారమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించారు. వేర్వేరు మార్గాల వల్ల పరిపాలనపరమైన చిక్కులతో పాటు నిధుల వ్యయం కూడా భారీగా పెరుగుతుందని ఆయన ముందే పసిగట్టారు. అందుకే వ్యూహాత్మకంగా మార్పులు చేస్తూ కేంద్రానికి బలమైన విన్నపాన్ని పంపారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన కొత్త ప్లాన్ ప్రకారం, ప్రస్తుతం నిర్మాణం కానున్న రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగానే రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అంటే రోడ్డు పక్కనే రైల్వే ట్రాక్ వచ్చేలా అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదన పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం రాష్ట్రానికి పెద్ద ఊరటనిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కేంద్ర రైల్వే శాఖ సంప్రదింపులు జరుపుతోంది. ఈ మార్పు వల్ల భూసేకరణ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, ఒకేసారి రెండు ప్రాజెక్టులకు అవసరమైన భూమిని సేకరించడం వల్ల రైతులకు కూడా స్పష్టత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

రైలు మార్గం రోడ్డు వెంటే ఉండటం వల్ల రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. సాధారణంగా సరుకు రవాణా చేసేటప్పుడు రోడ్డు నుంచి రైల్వే స్టేషన్లకు చేర్చడానికి అయ్యే అదనపు ఖర్చును ఈ విధానం ద్వారా నివారించవచ్చు. పారిశ్రామిక ఉత్పత్తులను నేరుగా గమ్యస్థానాలకు చేరవేయడం సులభతరమవుతుంది. ఈ సమన్వయం వల్ల పెట్టుబడిదారులకు కూడా హైదరాబాద్ పట్ల నమ్మకం పెరుగుతుంది. పక్కపక్కనే రైలు, రోడ్డు మార్గాలు ఉండటం వల్ల అంతర్జాతీయ స్థాయిలో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని, ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ ఇస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఖచ్చితమైన గడువును ఇప్పుడే ప్రకటించలేకపోయినా, సర్వే ప్రారంభం కావడం అనేది ఒక శుభపరిణామం. డీపీఆర్ సిద్ధమైన తర్వాతే ప్రాజెక్టు వ్యయం మరియు కాలపరిమితిపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ సర్వే నివేదిక ఆధారంగా ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను నీతి ఆయోగ్ మరియు కేంద్ర ఆర్థిక శాఖలు పరిశీలిస్తాయి. అన్ని శాఖల నుంచి అనుమతులు లభించిన తర్వాతే ఈ మెగా ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంతో చొరవ చూపుతుండటంతో పనులు వేగవంతం కానున్నాయి.

హైదరాబాద్ నగరం చుట్టూ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా, నగర శివారు ప్రాంతాలను రెండో స్థాయి నగరాలుగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన లక్ష్యం. గతంలో ఆయన ఢిల్లీ పర్యటనల్లో కేంద్రమంత్రులను వ్యక్తిగతంగా కలిసినప్పుడు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను పదేపదే వివరించారు. నగరంపై పెరుగుతున్న జనాభా ఒత్తిడిని తగ్గించాలంటే శివారు ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు అత్యుత్తమంగా ఉండాలని ఆయన పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ సాధించడంలో విజయం సాధించారు.

ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ పొరుగున ఉన్న రంగారెడ్డి, మెదక్, నల్గొండ, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల మధ్య అనుసంధానం పెరుగుతుంది. వేలాది మంది ప్రయాణికులు తక్కువ ఖర్చుతో, వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. కేవలం ప్రయాణికులకే కాకుండా వాణిజ్య పరంగా కూడా ఈ మార్గం కీలకం కానుంది. భారీ యంత్రాలు, ముడి సరుకులు, పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాకు ఈ రింగ్ రైలు వెన్నెముకలా మారుతుంది. ఇది రాష్ట్ర జీడీపీ వృద్ధికి దోహదపడటమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది. సమన్వయంతో రింగ్ రోడ్డు మరియు రింగ్ రైలు ప్రాజెక్టులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో భారీ పారిశ్రామిక హబ్‌లు ఏర్పడతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పరిశ్రమలకు అవసరమైన కనెక్టివిటీ ఒకే చోట లభిస్తుండటంతో బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ శివార్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతాయి. దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగంతో పాటు గొలుసుకట్టు అభివృద్ధి సాధ్యమవుతుంది. రైల్వే అలైన్‌మెంట్ ఖరారు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ వల్ల భవిష్యత్తులో భూసేకరణ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఈ ప్రాజెక్టులో డీపీఆర్ అనేది అత్యంత కీలకమైన ఘట్టం. సర్వే ద్వారా రైలు మార్గం ఏయే గ్రామాల మీదుగా వెళ్తుంది, ఎక్కడెక్కడ స్టేషన్లు వస్తాయి, వంతెనల నిర్మాణం ఎలా ఉండాలి అనే అంశాలపై స్పష్టత వస్తుంది. సర్వే పూర్తి చేసి పూర్తిస్థాయి రిపోర్టు రెడీ అయిన తర్వాత నీతి ఆయోగ్ ఆమోదం కోసం పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం వల్ల నిధుల సమీకరణ కూడా సులభతరం కానుంది. ఈ మెగా రైల్వే లైన్ తెలంగాణ రవాణా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

## అంబేద్కర్ విగ్రహానికి ఫ్లెక్సీలు పెట్టకూడదు

**అంబేద్కర్ యువజన సంఘం మునుగోడు**



**మునుగోడు, విశాలభారతి:** మునుగోడు చౌరస్తాలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎలాంటి పోస్టర్ లు, గానీ,మరణించిన వారి ఫ్లెక్సీలు గానీ, మరియు ఇతర కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలు పెట్టకూడదని అంబేద్కర్ యువజన సంఘం మునుగోడు ఆధ్వర్యములో శనివారం రోజు గమనిక బోర్డు కు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు..ప్రతి ఒక్కరు కోట్లమందికి వెలుగు నింపిన మహనీయుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్నారు..అంబేద్కర్ ని గౌరవిస్తూ వివిధ పార్టీల,యువజన సంఘాల,మరియు ప్రజలు ఎవరు కూడా ఫ్లెక్సీలు పెట్టకూడదని కోరారు..నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులకు మజ్జిగ ప్యాకేట్లను పంపిణీ



**సర్పంచ్ చింత రవి**

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం,కామారెడ్డి గూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నేటి నుంచి జరుగుతున్న వార్షిక పరీక్షల దృష్ట్యా చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులు పరీక్ష రాయడానికి కామారెడ్డి గూడెం పాఠశాలకు వస్తున్న క్రమంలో విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని పూర్వ విద్యార్థులు కన్న మల్లేశం,అంజాల నరేష్ లను కోరగా సర్పంచ్ చింత రవి అభిప్రాయం మేరకు వారు సహకారం అందించగా నేడు పాఠశాల విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన సర్పంచ్ చింత రవి. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వసంత,ఆశ కార్యకర్త మహమ్మద్ పర్వీన్,బిఆర్ఎస్ నాయకులు ఈదునూరి శేఖర్ రెడ్డి,గుండె రమేష్,చింత శేఖర్, అరుణ్,సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి సర్పంచ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం,పెద్దమడూర్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పానుగంటి యాదయ్యవిజయ దంపతుల కుమారుడు కిరణ్ కుమార్‌శ్రీలత వివాహం పాలకుర్తి మండల కేంద్రంలోని (ఎస్ఎల్ఎన్) ఇందిరా మహిళా శక్తి కళ్యాణ మండపంలో జరుగగా ఆ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రుద్రోజు భాస్కరచారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు యాదగిరి, కారుపోతుల యాకస్వామి, రుద్రోజు చారి,పత్తేపురపు శేఖర్,తోటకూరి మహేష్, ఉప్పుల విజయ్, చింత అనిల్ (సౌరాజ్యం), తదితరులున్నారు.

## ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రంలోని కొత్తవాడ ఎస్సి కాలనీకి చెందిన ఎర్ర మల్లయ్య ఇటీవల ఆనారోగ్య కారణంగా హైద్రాబాద్ లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని,అలాగే అదే కాలనీకి చెందిన ఇటుకల విజయ్ హైద్రాబాద్ లోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని వేర్వేరుగా వాళ్ళ ఇండ్లకు వెళ్ళి వాళ్ళను పరామర్శించి వాళ్ళ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట వార్డు సభ్యులు చిలుకూరి నరసయ్య, గోడిశాల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత ఐలయ్య,చింత బిక్షమయ్య, జోగు ముత్తయ్య,చింత చంద్రయ్య,ఉప్పుల యాదగిరి, కొంగ అశోక్,చింత ఎల్లయ్య, గాదరి కొండయ్య,ఉప్పుల అంజయ్య,ఉప్పుల బాబు, చింత బిక్షం,బర్ల ఎల్లయ్య, కాంగ్రెస్ యువజన నాయకులు కారుపోతుల యాకస్వామి,చింత బాబు, కారుపోతుల మహేష్,ఆకుల సంతోష్,కారుపోతుల సతీష్,గాదరి బాబు, పత్తేపురపు శేఖర్,తోటకూరి మహేష్,ఉప్పుల విజయ్, చింత సాగర్,ఉప్పుల శివ సాయి,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హత్య.. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



**నిజామాబాద్, విశాలభారతి:** ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 11.03.2026 రోజు జరిగిన కాంతామణి మహిళ హత్య కేసు సంబంధించిన సంఘటనా స్థలాన్ని స్వయంగా సందర్శించి ఘటనపై వివరాలు సేకరించిన నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. ప్రకాష్ సంఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి, కేసు దర్యాప్తు వేగవంతంగా , సమగ్రంగా కొనసాగించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా కేసులపై పూర్తి స్థాయి విచారణ జరుగుతుందని, చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ బి. ప్రకాష్ తెలిపారు. ఎసిపి తో పాటు ధర్పల్లి సిఐ బిక్షపతి, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసును విచారించిన ఏసీపీ. బి.ప్రకాష్



**నిజామాబాద్, విశాలభారతి:** ధర్పల్లి మండలం హోన్నజీపేట గ్రామంలో నమోదైన ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసు విషయమై ఏసీపీ గారు గ్రామాన్ని సందర్శించి బాధితులు మరియు గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా కొనసాగుతుందని చెప్పారు. కేసులపై పూర్తి స్థాయి విచారణ జరుగుతుందని, చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ బి. ప్రకాష్ తెలిపారు. ఏసీపీతోపాటు ధర్పల్లి సిఐ బిక్షపతి, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆముదాల పరమేశ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** ఉమ్మడి నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మున్సిపల్ లో జనసేన పార్టీ 12 వసంతాలు పూర్తిచేసుకుని 13 వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మునుగోడు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ,నేతాజీ, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ లే మనకు స్ఫూర్తి.. ఆదర్శం అని చెబుతూ జన సైనికులతో ప్రతిజ్ఞ చేయించారు. జనసేన కార్యకర్త నిశ్చయ ప్రతిన జనసేన సిద్ధాంతాలే నా శ్వాసగా, సామాజిక మార్పు కోసం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తానని మనస్ఫూర్తిగా ప్రమాణం చేస్తున్నాను. పదవుల కోసం కాదు, ప్రజా సంక్షేమం కోసమే నా ఈ ప్రయాణం. రాజకీయాల్లో ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్ని ప్రలోభాలు వచ్చినా తలవంచను. నా ఆశయం పవిత్రమైనది, నా పోరాటం నిజాయితీతో కూడుకున్నది జనసేన జెండా నా గుండె మీద ఉన్నంత కాలం, నా చివరి శ్వాస వరకు జనసేన సైనికుడిగానే కొనసాగుతానని ముక్కోటి దేవతల సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ మరియు మండల నాయకులు పీక ప్రవీణ్ కుమార్, పల్చం శ్రీకాంత్,చిన్నం ప్రశాంత్, రాజీవ్ ,సంజయ్, శ్రీకాంత్,కృష్ణారెడ్డి, శివారెడ్డి, రమణ బాబు,రామకృష్ణ, సాయి, శివ, వంశి, నజీర్ ,సన్నీ, శ్రవణ్, రాజు, జన సైనికులు పాల్గొన్నారు

## పసుమాములలో భార్య హత్య కేసు ఛేదన

- సుత్తితో తలపై కొట్టి హత్య చేసిన భర్త అరెస్ట్
- హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పసుమాముల వినాయక నగర్ కాలనీలో చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించినట్లు హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. భార్యను సుత్తితో హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 13, 2026 ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో పసుమాముల వినాయక నగర్ కాలనీలోని ఇంటి నెం. 373/13/257/A/1 వద్ద సుమారు 39 ఏళ్ల వయస్సు గల పనస ఉమారాణి మృతి చెందిన ఘటన జరిగింది. మొదట ఆమె బాత్‌రూమ్ పైకప్పుపై ఉంచిన చీపురును తీసుకునేందుకు నిచ్చెన ఎక్కిన సమయంలో పెయింట్ డబ్బా పడటంతో కింద పడిపోయిందని సమాచారం అందిందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను యశోద ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. అయితే మృతురాలి కుమార్తెలు తమ తల్లి మరణంపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై క్రైమ్ నెం. 417/2026గా నమోదు చేసి సెక్షన్ 194 BNSS కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి భర్త ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించగా, తన భార్యను తానే సుత్తితో తలపై కొట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని ఇన్స్పెక్టర్ నాగరాజు వెల్లడించారు. గత రెండు నెలలుగా అప్పులు మరియు డబ్బుల విషయమై భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయని, తన పేరుమీద ఉన్న ఆస్తిని పిల్లల పేరుమీద మార్చాలని ఒత్తిడి చేయడంతో కోపోద్రిక్తుడై హత్య చేసినట్లు నిందితుడు తెలిపినట్లు వివరించారు.ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



## ప్రజల ఇళ్లు కూల్చి మూసి అభివృద్ధి చేయడం అన్యాయం



**రాజేంద్రనగర్, విశాలభారతి:**

హిమాయత్ సాగర్ వేదికగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో "మూసి పునరుజ్జీవం - ప్రజా అభిప్రాయం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసి నది అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల ప్రణాళికను తెరపైకి తీసుకువచ్చిందని, ఇది సుందరీకరణ కాదని భూముల ఆక్రమణకు పథకమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 16,000 కోట్ల రూపాయలతో ఒక్క ఇంటిని కూడా కూల్చకుండా మూసి అభివృద్ధి ప్రణాళికను రూపొందించిందని, ఉప్పల్ - నాగోల్ ప్రాంతాల్లో సుమారు ఆరు కిలోమీటర్ల మేర విజయవంతంగా అభివృద్ధి చేసినట్లు కేటీఆర్ తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఇళ్లను కూల్చివేస్తూ వేల కోట్ల రూపాయల ఖర్చుతో కొత్త ప్రణాళికను తీసుకువచ్చిందని ఆయన విమర్శించారు. మూసి నది అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ ప్రజలకు నష్టం కలిగించే విధంగా వేల ఇళ్లను కూల్చివేయడం, భారీ స్థాయిలో భూసేకరణ చేపట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. మూసి పేరుతో సుమారు 3,300 ఎకరాల భూములపై ప్రభుత్వం కన్నేసిందని, ఆ భూముల విలువ లక్షన్నర కోట్ల రూపాయల వరకు ఉంటుందని కేటీఆర్ ఆరోపించారు. గతంలో మూసి అభివృద్ధి కోసం ఎక్స్‌ప్రెస్ వే, చెక్‌డ్యామ్‌లు, శుద్ధి కేంద్రాలు, నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాక్‌లు, పార్కులు వంటి సమగ్ర ప్రణాళికను రూపొందించామని ఆయన తెలిపారు.



అదేవిధంగా మురికి నీరు మూసిలోకి చేరకుండా శుద్ధి కేంద్రాల నిర్మాణానికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజల ఇళ్లను కూల్చి వాటి పునాదులపై అభివృద్ధి చేయడం అన్యాయమని, బాధితుల పక్షాన తమ పార్టీ ఎప్పుడూ నిలబడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజలతో కలిసి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విప్ వివేకానంద గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మండలి చైర్మన్ స్వామి గౌడ్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొని మూసి బాధితులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు కూడా ప్రభుత్వ ప్రణాళికలపై ఆందోళన వ్యక్తం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**కురవి, విశాలభారతి:** కురవి మండలంలోని కాకులబోడు తండ గ్రామానికి చెందిన బానోత్ మేఘురాజు-పార్వతి దంపతుల కుమార్తె ఝూన్సీ వివాహం వినోద్‌తో శనివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డి.ఎస్. రెడ్యా నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాంపత్య జీవితం ఆనందంగా, ఐశ్వర్యంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల మధ్య సంప్రదాయబద్ధంగా వివాహ కార్యక్రమం జరగడంతో వేడుక ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు గుగులోతు రవి నాయక్, స్థానిక సర్పంచ్ బానోత్ మల్సూరు, నేరడ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మల్లెపాక మధు, భద్రు, బిక్షపతి, శ్రీధర్, మంగీలాల్, బాబురావు తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు. వివాహ వేడుక గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

## పుష్కర పనులు యుద్ధ ప్రాతిపదికంగా చేపట్టండి

**ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**



**నిజామాబాద్, విశాలభారతి:** కందకుర్తి పుష్కర పనులు యుద్ధ ప్రాతిపదికంగా చేపట్టాలని ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు .శనివారం నాడు సాయంత్రం రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర్ ఘాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీతో కలిసి సందర్శించిన ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సబ్ కమిటీలో అనేక కీలక అంశాలు చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కందకుర్తి పుష్కర్ ఘాట్ల అభివృద్ధి కొరకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని అన్నారు.అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం మాత్రమే కాకుండా కందకుర్తి ప్రాముఖ్యతను కాపాడుతున్నమన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విఐపి పుష్కర ఘాటు పూజలు చేసుకోవడానికి షెడ్లను నిర్మాణం చేయాలని ఆయన అన్నారు రోడ్ల మరమ్మత్తులు రోడ్ల పన్నులు కల్వట్లు తదితర పనులను తొందరగా ప్రారంభించాలని ఆయన సూచించారు. రాష్ట్ర సహకారాల యూనియన్ చైర్మన్ మనల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్,జిల్లా గ్రంధాలయ చైర్మన్ రాజిరెడ్డి సర్పంచ్ గాయజుద్దీన్,రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ ,మాజీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి,మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి,, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు కార్తీక్ యాదవ్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు లచ్చవార్ నితిన్, ఉప సర్పంచ్ నాగేష్ ,ధనుంజయ,మాజీ సర్పంచ్ జవీద్, ఫుర్ఖన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో ఆదివారం రోజున శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. శనివారం రోజున బ్రహ్మోత్సవాలలో భాగంగా 14326 శనివారం ఉదయం 500 లకు సుప్రభాతం, 800 లకు గణపతి పూజ, 830 ని లకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విశేష పంచామృత అభిషేకం మరియు సహస్రనామ పుష్పార్చన ఉదయం 930 ని లకు ధ్వజారోవాణం మరియు హోమాము. మధ్యాహ్నం 100 గంటకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నాగిళ్ల రామచంద్రం,ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి ఎలక రాజునాగరాజు, (మల్లేష్ )సహాయ కార్యదర్శి ఉష్కాగుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి తూర్పునూరి నరసింహ గౌడ్,ఆరుట్ల లింగస్వామి,సంస్కృతిక కార్యదర్శులు తొర్పునూరి మల్లేష్ గౌడ్,గట్టు పవన్, కార్యవర్గ సభ్యులు నకిరేకంటి శ్రీశైలం,ఉదరి మారయ్య ఉదరి యాదయ్య, చెవగొని మహేష్, జక్క జక్కర్తి శేఖర్, నల్ల పర్వతాలు,ఉయ్యాల పల్లవి, గంగిరెడ్డి నాగలక్ష్మి, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి,బత్తుల శ్రీశైలం గౌడ్, మంచి కంటి భాస్కర్ గుప్తా,గుజ్జుల సురేందర్ రెడ్డి, అన్నెమోని గోవిందరాజు, ధర్మకర్తల మండలి బత్తుల విప్లవ గౌడ్, కాసుల వెంకటేష్, బాల్యం వెంకటాచలపతి, నల్ల గణేష్, ఆలయ అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 'మూసీలో మంచినీరు పారేలా చేస్తాం'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



భాగ్యనగరం తూర్పు దిశగా సరికొత్త అభివృద్ధి శకం ఆరంభం కాబోతోంది. హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ ప్రాంతాల రూపురేఖలను మార్చేస్తూ హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని అత్యంత ప్రతిష్టాత్మకంగా విస్తరిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. ఒకప్పుడు పడమర వైపు కోకాపేట ఎలాగైతే రియల్ ఎస్టేట్ హబ్‌గా మారిందో, భవిష్యత్తులో ఈ విజయవాడ రహదారి కారిడార్ కూడా అదే స్థాయి డిమాండ్‌ను సొంతం చేసుకోబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం రహదారుల విస్తరణే కాకుండా, ఇక్కడ అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి అడుగులు పడుతుండటం స్థానికులకు పెద్ద ఊరటనిచ్చే విషయం. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా హయత్ నగర్ సాయిబాబా గుడి= నుంచి జీ స్కూల్ వరకు ఉన్న రహదారిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ అధికారికంగా ప్రారంభించారు. సుమారు రూ.10 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల దారిగా మార్చే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయడమే లక్ష్యమని, రాబోయే సోమవారం నుంచే క్షేత్రస్థాయిలో యంత్రాలు రంగంలోకి దిగుతాయని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక కాలనీల ప్రజలకు ఈ విస్తరణతో ప్రయాణ సౌలభ్యం మరింత సులభతరం కానుంది. విజయవాడ జాతీయ రహదారిని 10 వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు సాధించామని, ఇందుకోసం నిరంతరం సమీక్షలు జరుపుతున్నామని మంత్రి పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ తూర్పు మండలం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ రహదారి వెన్నెముక వంటిదని, దీనిపై రద్దీని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేవలం రోడ్లే కాకుండా, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలను కలిపే హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లు కూడా ఇక్కడి నుండే వెళ్లేలా ప్లాన్ చేస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మారుతుందని కోమటిరెడ్డి వివరించారు.

నగరంలోనే ఒక అద్భుత కట్టడంగా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు రూ.940 కోట్లతో 'డబుల్ డెక్కర్' కారిడార్ రాబోతోంది. దేశంలోనే నాగపూర్ తర్వాత సుమారు 6 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.200 కోట్లను కేటాయించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. రాబోయే నెలలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోనుంది. ఈ డబుల్ డెక్కర్ కారిడార్ సాంకేతికంగా ఎంతో వినూత్నంగా ఉండబోతోంది. పై అంతస్తులో మెట్రో రైలు పరుగులు తీస్తుంటే, దాని కింద జాతీయ రహదారిపై వాహనాలు దూసుకెళ్తాయి. ఇక స్థానిక వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలకు తావులేకుండా కింద భాగంలో వెహికల్ అండర్ పాస్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల లోకల్ ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా సులభంగా రహదారిని దాటే వీలుంటుంది. అధునాతన ఇంజనీరింగ్ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు, నగరంలోని తూర్పు వైపు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని మంత్రి గట్టిగా నమ్ముతున్నారు.

అభివృద్ధి పనుల పరంపరలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో రైల్వే స్టేషన్‌ను కలుపుతూ రూ.8 కోట్లతో మరో కొత్త రోడ్డు నిర్మించబోతున్నట్లు కోమటిరెడ్డి వెల్లడించారు. దీనివల్ల ప్రయాణికులకు రైల్వే స్టేషన్ కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే, 'ఫ్యూచర్ సిటీ' పేరిట నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ నగరం ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం కేవలం రోడ్ల నిర్మాణానికే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తోందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరోవైపు మూసీ నది పునరుజ్జీవనం గురించి మంత్రి కోమటిరెడ్డి ఎంతో భావోద్వేగంతో మాట్లాడారు. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలు పడుతున్న నరకయాతనను వివరిస్తూ, 30 ఏళ్ల యువకులు కూడా ఆరోగ్య సమస్యలతో 60 ఏళ్ల వృద్ధుల్లా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలతో వేలాది కుటుంబాలు చితికిపోతున్నాయని, మూసీని ప్రక్షాళన చేయడం రాజకీయ నిర్ణయం కాదని, అది నల్గొండ ప్రజల జీవన్మరణ సమస్య అని ఆయన స్పష్టం చేశారు. ఈ విషజలాల నుంచి ప్రజలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మంత్రి పేర్కొన్నారు. నల్గొండ అంటేనే ఒకప్పుడు ఫ్లోరైడ్ జిల్లాగా, ఇప్పుడు విషపు జలాల జిల్లాగా ముద్రపడిందని, ఈ గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. గంగా, యమునా నదులను శుభ్రం చేస్తున్నప్పుడు సంతోషించే వారు, మన మూసీని శుభ్రం చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ వల్ల మురికి కూపం పోయి మంచి నీరు పారుతుందని, దీనివల్ల దాదాపు 40 లక్షల మంది ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. ఇది భవిష్యత్తు తరాల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయమని ఆయన కొనియాడారు. ప్రాజెక్టుల వల్ల ఇళ్లు కోల్పోతున్న 10 వేల మంది పేద కుటుంబాల గురించి ప్రభుత్వం ఆలోచిస్తోందని, వారికి మెరుగైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎవరూ రోడ్డున పడకుండా చూడటమే కాకుండా, వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయడం సరికాదని, తాము మాత్రం అభివృద్ధి ఎజెండాతోనే ముందుకు వెళ్తామని మంత్రి వెల్లడించారు.

## తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా నియామకం

**పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఇంద్రసేన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రతినిధిగా నియమితులైన బి. ఇంద్రసేన్ రెడ్డి (ISR) పార్టీ తనపై ఉంచిన నమ్మకం, విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. తనను రాష్ట్ర ప్రతినిధిగా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంద్రసేన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ప్రతినిధి బాధ్యతను అప్పగించినందుకు పార్టీ ముఖ్య నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా అంకిత భావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రజలకు చేరువగా ఉండి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఇంద్రసేన్ రెడ్డి తెలిపారు.

## సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక పనుల పరిశీలన : సర్పంచ్ శిల్పా రెడ్డి**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రజాపాలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి బాటలు పడుతున్నాయని మంచాల మండలంలోని ఖాగజ్ ఘాట్ గ్రామ సర్పంచ్ శిల్పా రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఖాగజ్ ఘాట్ గ్రామంలో జరుగుతున్న నర్సరీ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం సర్పంచ్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేసేలా గ్రామస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, వాటర్ సప్లై వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని మైలార్దేపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులు మరియు దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, గ్రామ పండుగ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ ప్రజలంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను ఆయన అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయ కమిటీ సభ్యులు ఎ. కృష్ణ యాదవ్, రావుల భాస్కర్, కాశమౌని అనిల్ ముదిరాజ్, శశిధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, దేవులపల్లి దాసు, నర్సింగ్, నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కోవాకుల బాబు, బొమ్మరాజు నరసింహ, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, దేవేందర్ గౌడ్, ధర్మేందర్ గౌడ్, శ్యామ్ యాదవ్, సురేష్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, వెంకటేష్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులకు సన్మానం



**సికింద్రాబాద్, విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మున్సిపాలిటీ కో కన్వీనర్ గా నియమితులైన రాజులు రామారావు, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ నిజాంపేట్ అధ్యక్షులు పి వెంకటేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమావేశం



- **రాజీ పడే కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి**
- **అధిక కేసులను పరిష్కరించడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం**
- **వి.మాధవి లత జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి**

**చౌటుప్పల్, విశాలభారతి:**

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ. జయరాజు వారి సూచనలమేరకు,సంస్థ కార్యదర్శి వి.మాధవి లత చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించి,చౌటుప్పల్ పోలీసు యంత్రాంగముతో చౌటుప్పల్ కోర్టు హాలులో సమావేశం ఏర్పాటు చేసి,వారితో మాట్లాడుతూ.. ఈనెల మార్చిలో 28వ తేది శనివారం రోజున నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో అధిక కేసుల పరిష్కారానికై తగిన చర్యలు తీసుకోవాలని,చౌటుప్పల్ కోర్టు పరిధిలో అత్యధిక కేసులు పెండింగులో ఉన్నందున అధిక మొత్తములో రాజీ పడదగు కేసులును పరిష్కరించేలా పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందచేయాలని,దీనికై ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని కేసులలో లోక్ అదాలత్ నోటీసులు అందించేలా చర్యలు తీసుకోవాలని,ప్రి సిట్టింగ్స్ ద్వారా కేసులలోని ఇరుపక్షాల మధ్య రాజి కుదిరించవచ్చని,ఈ వెసులుబాటును కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఈ లోక్ అదాలత్ నిర్వహణపై కోర్టు పరిధిలోని ప్రతీ మారుమూల గ్రామములో ప్రజలకు సమాచారం అందేలా, వారిని చైతన్య పరిచేవిదంగా తగిన ప్రచారం చేయాలని,ఈ లోక్ అదాలత్ నిర్వహణను నిరంతరం మ రా అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు పర్యవేక్షిస్తూ తగిన సూచనలు అందచేస్తున్నారని,ఈ లోక్ అదాలత్ ద్వారా అధిక కేసుల పెండింగును తగ్గించటమే కాకుండా సంఘంలో ప్రజలు స్నేహ పూర్వక వాతారణం పెరుగుతుందని తెలిపి జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 28 దాకా ప్రతీ రోజు కక్షిదారులు తమ కేసులును పరిష్కారం చేసుకునేలా వెసులుబాటు ఉంటుందని తెలిపి కార్యాక్రమములో పాల్గొన్న పోలీసువారికి తగిన సూచనలు చేసారు.ఈ సమావేశములో చౌటుప్పల్ డిఎస్పి మధుసూధన్ రెడ్డి,సి ఐ మన్మధకుమార్,నారాయణపూర్ సి. ఐ రాములు,ఎక్సైజ్ సి. ఐ బాలోజీ నాయక్, ఎస్. ఐలు, ట్రాఫిక్ మరియు పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## పెద్ద షాపూర్‌లో ఉచిత ఆరోగ్య మేళా

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య మేళాను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ గారు శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న ఆరోగ్య మేళాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఆరోగ్య మేళాలో బీపీ, షుగర్ వంటి సాధారణ పరీక్షలతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## బుచ్చిరెడ్డి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలం తూప్రాన్ పేట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాజా మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి తండ్రి తాడూరు బుచ్చి రెడ్డి ఇటీవల మృతి సందర్భలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తూప్రాన్ పేటలోని వారి నివాసానికి వెళ్లి కి.శే బుచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడంజరిగింది.ఈ కార్యక్రంలో తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దండుగుల వెంకటేష్,గంధం ఆంజనేయులు,తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మోగుదాల రమేష్ గౌడ్



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని 14వ వార్డు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిన్నె రవి సోదరీమణి కిన్నె రమ్య మోహన్ వివాహ వేడుకలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మగుదల పావని రమేష్ గౌడ్ మరియు ఆ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సందగళ్ల విజయ సతీష్ గౌడ్,వర్కాల రవి గౌడ్,బండి వెంకటయ్య,పబ్బతి శ్రీనివాస్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్పివి వాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలి

**హోమియో డాక్టర్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్**




**చౌటుప్పల్ విశాలభారతి:** అర్హులైన 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పీవి వాక్సిన్ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్ సూచించారు. మండల పరిధి పంతంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నందు హెచ్పివి వాక్సిన్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెచ్పివి వాక్సిన్ పై అపోహలు నమ్మకూడదని తెలిపారు. వాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భశయ కాన్సర్ ను నివారించవచ్చాన్నారు. తల్లిదండ్రులు దీనిపై అవగహన కలిగి ఉండి, బాలికలను ప్రోత్సహిందం ద్వారా వారి ఆరోగ్యాలను కాపాడినవాళ్లు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎచ్పి జ్యోతి,ఆశా వర్కర్ లలిత, శైలజ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

**రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య..**



**ముషీరాబాద్, విశాలభారతి:** బీసీల రాజ్యాధికారం కోసం బీసీ సమాజం ఉద్యమించాలని రాజ్య సభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ను ఎంపీ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు చట్టసభలలో 50% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. మేమెంతో మాకు అంతా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ రంగంలోనూ, న్యాయమూర్తుల నియామకంలోనూ బీసీ ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్ని రంగాలలో ఓబీసీలకు రాజ్యాధికారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి వీరబాబు, శ్రీహరి, రాజు, వంశీ, నికిల్, ఎన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కఠోర శ్రమ అంకితభావంతో సివిల్స్‌లో విజయం

**యుపిఎస్సి టాపర్ లు ఎస్. వర్షిత్ రెడ్డి, విజయసింహ రెడ్డి**



**ముషీరాబాద్, విశాలభారతి:** కఠోర శ్రమ అంకితభావంతో యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించవచ్చు అని యుపిఎస్సి టాపర్ లు ఎస్. వర్షిత్ రెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ 259) , విజయ సింహ రెడ్డి ( ర్యాంక్ 682) లు తెలిపారు. శనివారం విజన్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో యుపిఎస్సి పరీక్షలలో విజయవంతమైన అభ్యర్థులు తమ ప్రయాణాలు, వ్యూహాలను పంచుకోవడానికి స్ఫూర్తిదాయకమైన సెమినార్‌ను నిర్వహించరు.ఈ సెమినార్ కు వర్షిత్ రెడ్డి, విజయసింహారెడ్డిలు హాజరై తమ అనుభవాలను అభ్యర్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయత్న ప్రయాణంలో స్థిరత్వం, స్వీయక్రమశిక్షణ ఉండాలని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో విజన్ ఐఏఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్ తోపాటు సివిల్ అభ్యర్థులు భారీగా పాల్గొన్నారు.

## మహిళా శక్తిని చాటాలి

**బిజెపి సీనియర్ నాయకులు పి మాధవి**



**ముషీరాబాద్,విశాలభారతి:** మహిళలు తమ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ సీనియర్ నాయకులు పి మాధవి ఆకాంక్షించారు. శనివారం అడిగ్మెంట్ డివిజన్ లలిత నగర్ కమిటీ హాల్లో మహిళా ఏంఫార్మేట్ రైట్ , ఫర్ వుమెన్ రైట్స్, మరియు ఉమెన్ రైట్స్ ఆధ్వర్యంలో మాధవి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జ్యోతి, మహీరిన్, కే స్వప్న, ఇంద్ర, ఉమా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు పోటీలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయలపై ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మహిళా దినోత్సవ వేడుకలే కాదని సమాజం వారిపై గౌరవాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం

**నార్సింగి పోలీసుల దర్యాప్తు**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** టీజీపీఏ నుండి మంచిరేవుల సర్వీస్ రోడ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న పొదల వద్ద ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించినట్లు సమాచారం అందడంతో నార్సింగి పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరిశీలనలో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో ముఖం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 55 నుండి 65 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మృతురాలికి తెల్లటి జుట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం వద్ద ఉన్న దుస్తుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

# వ్యవసాయ సాంకేతికతలపై జాతీయ సదస్సు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య నాయకత్వంలో "సుస్థిర వ్యవసాయ-ఆహార వ్యవస్థల కోసం వాతావరణ సహన సాంకేతికతలు" అనే అంశంపై జాతీయ సదస్సు మార్చి 12, 13 తేదీలలో రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యా సంస్థ సభాభవనంలో నిర్వహించబడింది. మార్చి 12న జరిగిన ప్రారంభ కార్యక్రమానికి వ్యవసాయ పరిశోధన రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఎస్.కె. రావు పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా త్రిపుర రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ గౌరవ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎస్.జి. అయ్యంగార్, నూనెగింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె. మాథూర్, వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, వ్యవసాయ అభివృద్ధి కేంద్రం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు, జర్మనీలోని బెర్లిన్ నగరానికి చెందిన డిజిటల్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రఘు చాలిగంటి పాల్గొన్నారు. ఈ సదస్సుకు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ బి. వెంకటేశ్వర్లు ప్రారంభ కీలక ఉపన్యాసం అందించారు. ఆయన వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో సుస్థిర పద్ధతులు, ఆధునిక సాంకేతికతల అవసరాన్ని వివరించారు.



ఈ సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ మరియు న్యూఢిల్లీ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు కలిపి మొత్తం 105 మంది పాల్గొన్నారు. వాతావరణ మార్పులకు తట్టుకునే విధంగా వ్యవసాయ-ఆహార వ్యవస్థల్లో కొత్త పరిశోధనలు, సాంకేతికతలు, సుస్థిరత మరియు ఆహార భద్రత సాధనపై విస్తృతంగా చర్చలు జరిగాయి. సదస్సులో మొత్తం ఆరు సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. మొదటి సమావేశంలో వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంట రకాల అభివృద్ధిపై చర్చించారు. రెండవ సమావేశంలో ఆధునిక సాంకేతికతలతో కూడిన ఖచ్చిత వ్యవసాయ పద్ధతులపై వివరించారు. మూడవ సమావేశంలో వాతావరణ మార్పుల నేపథ్యంలో పురుగులు మరియు వ్యాధుల నియంత్రణపై చర్చించారు. నాల్గవ సమావేశంలో వనరుల సంరక్షణ సాంకేతికతలపై చర్చించగా, ఐదవ సమావేశంలో వాతావరణ సహన వ్యవసాయ విధానాలపై వివరించారు. ఆరో సమావేశంలో సమాజ మరియు ఆర్థిక సాధికారత, గిరిజన వ్యవసాయ అభివృద్ధిపై చర్చలు జరిగాయి.

సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తల నుండి ఆరు ప్రధాన ఉపన్యాసాలు, పద్దెనిమిది మౌఖిక ప్రదర్శనలు, ఎనభై నాలుగు పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. మొదటి రోజు సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నృత్యాలు, నాటికలు మరియు మైమ్ ప్రదర్శనలతో సభకు హాజరైన వారిని అలరించారు.

రెండో రోజు అయిన మార్చి 13న జరిగిన ముగింపు కార్యక్రమంలో సమావేశంలో పాల్గొన్న పరిశోధకులకు ఉత్తమ మౌఖిక మరియు పోస్టర్ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను ముఖ్య అతిథి డాక్టర్ ఎస్.కె. రావు అందజేయగా, గౌరవ అతిథులుగా ప్రొఫెసర్ ఎస్.వి. రెడ్డి, డాక్టర్ వి. రవీంద్ర బాబు మరియు విశ్వవిద్యాలయం పరిశోధన డైరెక్టర్ డాక్టర్ ఎం. బాలరాం పాల్గొన్నారు. సదస్సు నివేదికను డాక్టర్ కె. సురేష్ సమర్పించగా, విస్తరణ విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం. జగన్ మోహన్ రెడ్డి వందన సమర్పణ చేశారు. నిర్వాహకుల ప్రకారం ఈ సదస్సు ద్వారా సుస్థిర వ్యవసాయ-ఆహార వ్యవస్థల అభివృద్ధికి వాతావరణ సహన సాంకేతికతలు అభివృద్ధి చేయడానికి మార్గదర్శక సూచనలు లభించనున్నాయి.

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం

**మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జగదీశ్వర్**

SSC Public Examination March-2026

| Date:14-03-2026 | | | Mandal:Abdullapurmet | | | | |
|---|---|---|---|---|---|---|---|
| S.NO | Centre Code | Centre Name | Total Allotment | Present | Absent | Seating Squad | Rema |
| 1 | 23159 | ZPHS ABDULLAPUR | 187 | 187 | 0 | Present | |
| 2 | 23081 | ZPHS INJAPUR | 240 | 238 | 2 | Present | |
| 3 | 23077 | ZPHS RAGANNAGUDA | 240 | 239 | 1 | Present | |
| 4 | 23066 | ZPHS PEDDA AMBERPET | 237 | 237 | 0 | Present | |
| 5 | 23079 | St.Joseph's High School | 227 | 227 | 0 | Present | |
| 6 | 23068 | Rajasree vidya Mandir | 214 | 212 | 2 | Present | |
| 7 | 23080 | Brilliant High school | 237 | 236 | 1 | Present | |
| 8 | 23078 | VASHISTA Model High SCHOOL | 185 | 185 | 0 | Present | |
| 9 | 23160 | New Chaitanya High School | 169 | 169 | 0 | Present | |
| | | Total | 1936 | 1930 | 6 | | |

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మార్చి-2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (ఎంఈఓ) జగదీశ్వర్ తెలిపారు. మండలంలోని మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా నమోదైన 1936 మంది విద్యార్థుల్లో 1930 మంది పరీక్షలకు హాజరవ్వగా, 6 మంది గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలైన జెడ్పీహెచ్ఎస్ అబ్దుల్లాపూర్ 187, జెడ్పీహెచ్ఎస్ ఇంజాపూర్ 238, జెడ్పీహెచ్ఎస్ రాగన్నగూడ 239, జెడ్పీహెచ్ఎస్ పెద్ద అంబర్‌పేట్ 237, సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 227, రాజశ్రీ విద్యామందిర్ 212, బ్రిలియంట్ హైస్కూల్ 236, వశిష్ట మోడల్ హైస్కూల్ 185, న్యూ చైతన్య హైస్కూల్ 169 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ మరియు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించాయని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయని మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జగదీశ్వర్ తెలిపారు.

## ఘనంగా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి కుమార్తె వివాహం

**ప్రముఖులు హాజరై నూతన దంపతులకు ఆశీర్వాదాలు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్ కుంట్లూర్ డివిజన్ తట్టి అన్నారం గ్రామానికి చెందిన మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి కుమార్తె వివాహ వేడుక కే.బి.ఆర్ కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అలాగే సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్టు మండల సిపిఐ కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, నాయకులు ధూపం నిరంజన్, సాకలి నర్సింహా తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆడపిల్లలకు ప్రత్యేక పథకం ప్రవేశపెట్టాలి



**సికింద్రాబాద్, విశాలభారతి :** ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక పథకం ప్రవేశపెట్టాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోచ నిజాంపేట్ అధ్యక్షులు పి వెంకటేశ్వర్ ముదిరాజ్ కోరారు. ఈరోజుల్లో పేద మహిళల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులకు ఎంతో ఇబ్బందికరంగా మారింది, ఎందుకంటే బంగారం ధర భయంకరంగా పెరగడం వల్ల ఆడపిల్ల పెండ్లికి బంగారం ఇవ్వాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నారు కనుక దేశ ప్రధాని మన నరేంద్ర మోడీ ఆడపిల్లల గురించి ఆలోచించి వారి పెళ్లి కానుకగా వాళ్లకు పెళ్లి కార్డు, ఆధార్ కార్డు తీసుకొని ప్రభుత్వము తక్కువ ధరకు బంగారం ఆడపిల్లకు కానుకగా ఇచ్చి ఆడపిల్లలను ఆదుకోవాల్సిందిగా కోరారు.

## ఏఐటియుసి నాయకుడు ఈశ్వర్ గృహప్రవేశం

**ముఖ్య అతిధిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ నాయకుడు ఈశ్వర్ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్, నాయకులు ధూపం నిరంజన్, రాములు, వారి కుటుంబ సభ్యులు హాజరై ఈశ్వర్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, స్నేహితులు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మన్సూరాబాద్ డివిజన్‌లోని హకీమాబాద్ మసీదు వద్ద టి పిసిసి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాస విరమణ చేశారు.ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు కలిసి సోదరభావంతో జీవించడం గొప్ప సంపద అని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఇంటికి శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్య తేజ రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్రమ్ , అలీమ్ ఖాన్ , సదర్ , జక్కి ఖాన్ , గౌస్ , ఖాసీమ్ , సలీమ్ ఖాన్ , ముక్రమ్ తోపాటు ముస్లిం సోదరులు, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో మరో ఘనత

- మోకాలి కీళ్ల మార్పిడి సర్జరీ విజయవంతం
- కృతజ్ఞతలు తెలిపిన రోగి బంధువులు
- ప్రభుత్వ వైద్యం పై ప్రజల విశ్వాసంపెంచి వైద్యులు



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సి హెచ్ సి లో మరో అరుదైన ఘనత సాధించారు పాల్వంచ ప్రభుత్వ వైద్యులు.వరంగల్‌కు చెందిన కవిత (52)కు ఎడమ మోకాలి నొప్పితో దీర్ఘకాలికంగా బాధపడుతూ పాల్వంచ లోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించారు.వైద్యులు పరీక్షించి మోకాలి ఆపరేషన్ చేయాలని చూచించారు.డా. శైలేష్ కుమార్ నేతృత్వంలో సుమారు 4 గంటల పాటు శ్రమించి,మోకాలి మార్పిడి సర్జరీ విజయవంతం చేశారు. కార్పొరేట్ స్థాయిలో మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స. చేసి ప్రభుత్వ వైద్యం పై ప్రజలకు విశ్వాసం పెంచారు. లక్షల రూపాయల ఖర్చయ్యే ఆపరేషన్‌ను పేద రోగికి ఉచితంగా పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలలో సర్జరీ చేయడంతో పేదరిగి కుటుంబసభ్యులు,మరియు పాల్వంచ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.పాల్వంచ సి హెచ్ సి లో ఇది రెండో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడం విశేషం.

## పాత ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించండి

**రాజేంద్రనగర్‌లో ఈ–వేస్ట్ డ్రైవ్**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**




రాజేంద్రనగర్ సర్కిల్-19 జీహెచ్ఎంసీ పరిధిలో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈరోజు ఈ-వేస్ట్ సేకరణ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. డిప్యూటీ కమిషనర్ బి. సురేందర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ మంద మకరంద సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సేకరణ కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, పర్యావరణానికి హాని కలగకుండా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాల్సిన అవసరాన్ని ఆయన వెల్లడించారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి ఇంటిలో మొబైల్ ఫోన్లు, చార్జర్లు, కంప్యూటర్ భాగాలు, టెలివిజన్ పరికరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని తెలిపారు. కాలక్రమేణా అవి పనికిరాకపోయినప్పుడు వాటిని నిర్లక్ష్యంగా పారవేయడం వల్ల పర్యావరణానికి మరియు ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని అన్నారు. అందువల్ల ఇలాంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా సేకరించి, రీసైక్లింగ్ కేంద్రాలకు పంపించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలో నిల్వ ఉన్న పాత మొబైళ్లు, చార్జర్లు, కంప్యూటర్ విడిభాగాలు, బ్యాటరీలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ సేకరణ కేంద్రాలకు అందజేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి నగరాన్ని పరిశుభ్రంగా, కాలుష్యరహితంగా ఉంచడం జీహెచ్ఎంసీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డై.ఈ.ఈ, ఏ.ఈ.ఈ, డీపీఓ, రిసోర్స్ పర్సన్స్, ఇతర మున్సిపల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, వాటిని సక్రమంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.

## రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంతం ఎస్సీలకు అమలు చేయాలి

**ఎస్సీ ఎస్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలి**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాలకు కొనసాగిస్తున్న ఎస్సీ రిజర్వేషన్ 15% ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు వర్తింపజేయాలని అసెంబ్లీలో మంత్రులు ఎమ్మెల్యేలు ప్రస్తావించాలని అన్నారు.షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో శనివారం విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాలకు ప్రవేశ పెట్టిన 15 శాతం రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాలకు స్థానికంగా వర్తింపజేయాలని ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు ఈనెల 16 నుండి జరిగే వేసవి అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలు ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల అభివృద్ధిపై జరుగుతున్న వివక్షత,తలచివేత, అన్యాయాన్ని గుర్తించి అసెంబ్లీలో లేవనెత్తాలని బొమ్మెర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్వతంత్రం వచ్చి వివక్షతకు గురవుతున్న ఎస్సీ కులాలకు రిజర్వేషన్ ప్రసాదిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానిక సంస్థల్లో ఎస్సీ రిజర్వేషన్ జనరల్ లో కలపకుండా 15% రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంతా ఎస్సీలకు స్థానికంగా అమలు చేయాలని కోరారు. అంగన్వాడి,ఆయా,అటెండర్ స్థానిక ఉద్యోగ నియామకాలు ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయంపై ఎస్సీ మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం ఎత్తాలని అన్నారు. ఇప్పటికైనా వెనుక బడ్డ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడ్డ ఎస్సీ కులాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నాం. షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్ , ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ కొంకటి కృష్ణ, మహిళా నాయకురాలు దార్ల లక్ష్మి ,ఎనగంటి శ్రీనివాస్,చిన్న శీను, కన్నం చంద్రయ్య,డి లింగమూర్తి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు కారల్ మార్క్స్

**ఎమ్మెల్యే కూనంనేని**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు, మహా తత్వవేత్త కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స్ 143వ జయంతిని శనివారం సుగుణ గార్డెన్స్లో ఘణంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటనికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్స్ ప్రతిపాదించిన సమానత్వభావాలు శ్రమ జీవుల హక్కుల కోసం చేసిన సిద్ధాంత పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి సమాన హక్కులు సాధించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. ప్రస్తుత కాలంలో కూడా మార్క్స్ ఆలోచనలు సమాజ మార్పుకు మార్గం చూపుతున్నాయని, కార్మికులు, రైతులు ఐఖ్యంగా పోరాడితేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, బెజవాడ వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాలవిశ్వనాధం, కల్లూరివెంకటేశ్వర రావుతో పాటు, వాసిరెడ్డి మురళీ, సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

**సానిటరీ కిట్ల పంపిణీ**



**మొయినాబాద్, విశాలభారతి:** నక్కలపల్లి గ్రామపంచాయతీలో గ్రామ శుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం వారు అందిస్తున్న సేవలను కొనియాడుతూ సానిటరీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగళారం యాదయ్య మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఎండా వానా తేడా లేకుండా గ్రామ శుభ్రత కోసం వారు అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. వారి కష్టానికి గ్రామ ప్రజలందరూ కృతజ్ఞతలు తెలపాలని కోరారు. ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మన ఆరోగ్యానికి కలిగే అనర్థాలను వివరించారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ సంచుల స్థానంలో జ్యూట్ బ్యాగులు లేదా పేపర్ బ్యాగులను ఉపయోగించాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. నేటి కాలంలో ప్లాస్టిక్ మనిషి జీవితంలో విషంలా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్, వార్డు సభ్యులు గౌరి శ్రావంతి, మానుక తేజ శ్రీ, కొండ స్వాతి, మంగళారం రవీందర్, బంటు అశ్విని, గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, కరోబార్ నరేందర్, నాయకులు మంగళారం నవీన్, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఏడుస్మార్ట్ ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభోత్సవం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఉమ్మడి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చిత్రసీమ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏడుస్మార్ట్ ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రాథమిక విద్య ఎంతో కీలకమని అన్నారు. పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి ప్రీప్రైమరీ విద్య మంచి పునాది వేస్తుందని తెలిపారు. ఆటలు, పాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారికి మంచి విద్యా వాతావరణం కల్పించడం పాఠశాలల బాధ్యత అని పేర్కొన్నారు. చిత్రసీమ కాలనీలో ప్రారంభమైన ఏడుస్మార్ట్ ప్రీప్రైమరీ స్కూల్ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించి, భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తూ పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రూ.10 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

**ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధు యాష్కి గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రహదారుల విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఎల్.బి నగర్ నియోజకవర్గం పరిధిలోని హయత్‌నగర్ ప్రాంతంలో తొర్రూరు ఎక్స్ రోడ్ నుండి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు శనివారం రోజు ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్ & బీ శాఖ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి , గడ్డి అన్నారం వ్యవసాయ కమిటీ చిలుక మధు సూదన్ రెడ్డి, ముద్దగౌని రాంమోహన్ గౌడ్ తో పాటు టి పిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్,వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్ గౌడ్, స్థానిక నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి , యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి,పన్యాల జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరు మండల పరిధిలో ప్రజల చిరకాల వాంఛ అయిన మణుగూరు నుండి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) మీదుగా బయ్యారం క్రాస్ రోడ్ వరకు ఉన్న ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం చుట్టారు. రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆర్ అండ్ బి బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత కొద్ది నెలలుగా ఈ రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారి వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, పాఠశాల బస్సులు, విద్యార్థులు మరియు బీటీపీఎస్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారుల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. రోడ్డు పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి సతీష్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అనగానే చాలా మందికి ముందుగా గుర్తుకొచ్చేది నివాస గృహాల మార్కెట్. కానీ ప్రస్తుత గణాంకాలను పరిశీలిస్తే నగర మార్కెట్లో కమర్షియల్ ఆఫీస్ స్పేస్ దృఢంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా ఐటీ రంగం వేగంగా విస్తరించడంతో పాటు గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించడంతో నగరం దేశంలోనే ప్రముఖ కమర్షియల్ హబ్‌గా ఎదుగుతోంది. ముంబై, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటోంది.**

- విశాలభారతి, హైదరాబాద్

# సిటీ రియాలిటీలో కమర్షియల్ డిమాండ్

## నివాస గృహాలతోపాటు ఆఫీస్ స్పేస్ సత్తా

### గ్లోబల్ కంపెనీలకు కొత్త కేంద్రంగా అవతరిస్తున్న మెట్రో నగరం



ఒకప్పుడు కేవలం ఐటీ కేంద్రంగా పేరొందిన హైదరాబాద్ ఇప్పుడు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (GCC) కేంద్రంగా మారింది. 2025లో హైదరాబాద్‌లో రికార్డు స్థాయిలో సుమారు 11.4 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైంది. దేశంలోని ప్రధాన ఐదు నగరాల్లో హైదరాబాద్ కీలక స్థానాన్ని సంపాదించడానికి ఇది ప్రధాన కారణమైంది. కమర్షియల్ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రస్తుతం డిమాండ్, సప్లై రెండూ సమానంగా పెరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అపరిమిత ఎఫ్ఎస్ఐ విధానం వల్ల నగరంలో భారీ స్థాయిలో ఆఫీస్ భవనాల నిర్మాణం కొనసాగుతోంది. 2025లోనే సుమారు 12 మిలియన్ చదరపు అడుగుల కొత్త ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లోకి వచ్చింది. 2026 చివరి నాటికి హైదరాబాద్ మొత్తం ఆఫీస్ స్టాక్ 144 మిలియన్ చదరపు అడుగులను దాటుతుందని అంచనాలు సూచిస్తున్నాయి.

**ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్ రంగాల డిమాండ్**

ఆఫీస్ స్పేస్ డిమాండ్‌కు ప్రధాన కారణం ఐటీ రంగం విస్తరణ. దీనితో పాటు ఫార్మాస్యూటికల్ కంపెనీలు, బ్యాంకింగ్ మరియు ఫైనాన్స్ రంగ సంస్థలు కూడా హైదరాబాద్‌ను తమ కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. ఈ రంగాలు భారీ స్థాయిలో ఆఫీస్ స్థలాలను లీజుకు తీసుకోవడం వల్ల మార్కెట్‌లో అబ్సార్ప్షన్ కూడా పెరుగుతోంది. సప్లయి ఎంత పెరిగినా లీజింగ్ అదే స్థాయిలో కొనసాగడం నగర కమర్షియల్ మార్కెట్ బలాన్ని సూచిస్తోంది.

**అద్దెల్లో పెరుగుదల**

బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆఫీస్ అద్దెలు ఇప్పటికీ 20 నుంచి 30 శాతం వరకు తక్కువగా ఉన్నాయి. ఇదే గ్లోబల్ కంపెనీలను ఆకర్షిస్తున్న ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రీమియం ప్రాంతాల్లో గ్రేడ్A ఆఫీస్ భవనాలకు చదరపు అడుగుకు నెలవారీ అద్దె రూ.70 నుంచి 95 వరకు ఉంది. 2025లో ఈ అద్దెలు సగటున 10 శాతం పెరిగాయి. సప్లై ఎక్కువగా ఉన్నప్పటికీ అధునాతన సదుపాయాలు, గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ ఉన్న భవనాలకు భారీ డిమాండ్ ఉండటంతో అద్దెలు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. అయితే భారీ స్థాయిలో నిర్మాణాలు కొనసాగుతుండటంతో కొంత మేర ఖాళీ ఆఫీస్ స్థలాలు కూడా పెరుగుతున్నాయి. తాజా నివేదికల ప్రకారం 2026 మార్చి నాటికి హైదరాబాద్‌లో వేకన్సీ రేటు సుమారు 24 శాతంకు చేరే అవకాశం ఉంది. అంటే మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రతి నాలుగు ఆఫీసుల్లో ఒకటి ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడవచ్చు. ముఖ్యంగా పాత గ్రేడ్B భవనాలు ఈ ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మితమవుతున్న ఆధునిక భవనాలు మార్కెట్‌లోకి వస్తుండటంతో పాత భవనాల్లో అద్దెలు తగ్గే అవకాశం ఉంది. అయితే గ్రీన్ సర్టిఫికేషన్, ఆధునిక సౌకర్యాలు ఉన్న గ్రేడ్A ప్రాజెక్టులకు మాత్రం డిమాండ్ స్థిరంగా ఉంటుందని భావిస్తున్నారు.

**దేశవ్యాప్తంగా హైదరాబాద్ ప్రత్యేకత**

ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లేదా బెంగళూరులోని ఔటర్ రింగ్ రోడ్ ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్‌కు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా తక్కువ అద్దెలు, విస్తృతమైన రోడ్లు, మెట్రో కనెక్టివిటీ వంటి అంశాలు కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. బెంగళూరు, ముంబై నగరాల్లో ప్రీమియం ఆఫీస్ స్పేస్ ఇప్పటికే పరిమితికి చేరుకున్నప్పటికీ హైదరాబాద్‌లో ఇంకా విస్తరించడానికి పెద్ద అవకాశాలు ఉన్నాయి.

**GCCల విప్లవం**

హైదరాబాద్ కమర్షియల్ మార్కెట్‌లో ఇటీవల కనిపిస్తున్న ప్రధాన మార్పు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల పెరుగుదల. గతంలో కాల్ సెంటర్ల కోసం మాత్రమే వచ్చిన అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు తమ వ్యూహాత్మక కార్యకలాపాల కేంద్రాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాలు ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వాంగార్డ్, మెక్‌డొనాల్డ్స్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను విస్తరించాయి. 2025లో జరిగిన మొత్తం లీజింగ్‌లో సుమారు 50 శాతం వాటా ఈ GCCలదే కావడం విశేషం.

**ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ పెరుగుదల**

హైబ్రిడ్ పని విధానం విస్తరించడంతో కొవర్కింగ్ స్పేస్‌లకు కూడా డిమాండ్ పెరుగుతోంది. స్టార్టప్‌లు, చిన్న సంస్థలు ఫ్లెక్సిబుల్ ఆఫీస్ మోడల్‌ను ఎక్కువగా ఎంచుకుంటున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం సుమారు 38 వేలకుపైగా ఫ్లెక్స్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో ఈ విభాగం మరింత విస్తరించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కమర్షియల్ రంగంతో పాటు నివాస గృహాల మార్కెట్ కూడా హైదరాబాద్‌లో విస్తృతంగా పెరుగుతోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా నగరం అన్ని దిశలా విస్తరిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ మరియు ఉత్తర ప్రాంతాల్లో అధిక డిమాండ్ కనిపిస్తోంది.

**పశ్చిమ హైదరాబాద్ – లగ్జరీ మార్కెట్**

పశ్చిమ హైదరాబాద్ ప్రాంతం ఇప్పటికీ అత్యంత ప్రీమియం నివాస మార్కెట్‌గా కొనసాగుతోంది. ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఎక్కువగా ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. కోకాపేటలో నియోపోలిస్ అభివృద్ధి కారణంగా ధరలు భారీగా పెరిగాయి. అక్కడ చదరపు అడుగుకు రూ.11,200 నుంచి 17,000 వరకు ధర పలుకుతోంది. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్‌ల సగటు ధర రూ.11,100 నుంచి రూ.13,000 వరకు ఉంది. అద్దెలు కూడా గత ఏడాదితో పోలిస్తే 13.3 శాతం పెరిగాయి. తెల్లాపూర్ ప్రాంతంలో ధరలు రూ.7,300 నుంచి రూ.8,500 వరకు ఉన్నాయి. మధ్యతరగతి కొనుగోలుదారులకు ఇది ఆకర్షణీయమైన మార్కెట్‌గా మారుతోంది.

**ఉత్తర హైదరాబాద్ – నూతన గ్రోత్ సెంటర్**

ఉత్తర హైదరాబాద్‌లో కూడా రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. కండ్లకోయ ఐటీ పార్క్ ప్రతిపాదనలు మరియు గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతం కొత్త పెట్టుబడి కేంద్రంగా మారుతోంది. కొంపల్లి ప్రాంతంలో చదరపు అడుగుకు ధరలు రూ.5,600 నుంచి 9,900 వరకు ఉన్నాయి. కుటుంబాల కోసం అనువైన వాతావరణం ఉండటంతో విల్లా ప్రాజెక్టులకు ఇక్కడ మంచి డిమాండ్ ఉంది. బాచుపల్లిలో ధరలు రూ.6,500 నుంచి 10,800 మధ్య ఉన్నాయి. 2026 ప్రారంభంలో అత్యధిక రిజిస్ట్రేషన్లు నమోదైన జిల్లాగా మేడ్చల్‌మల్కాజిగిరి నిలిచింది.

**తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో అవకాశాలు**

పశ్చిమ ప్రాంతంతో పోలిస్తే తూర్పు హైదరాబాద్‌లో ధరలు తక్కువగా ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. ఉప్పల్, పోచారం ప్రాంతాల్లో చదరపు అడుగుకు ధరలు రూ.4,500 నుంచి రూ.7,800 వరకు ఉన్నాయి. శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో విమానాశ్రయం మరియు ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టుల ప్రభావంతో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెరుగుతున్నాయి. అక్కడ అపార్ట్‌మెంట్ ధరలు రూ.6,200 నుంచి 10,000 మధ్య ఉన్నాయి. ధరల వారిగా మార్చి 2026 నాటికి హైటెక్ సిటీలో చదరపు అడుగుకు సగటు ధర రూ.12,950గా ఉంది. నార్సింగిలో రూ.10,550, కొండాపూర్‌లో రూ.10,500గా ఉంది. కూకట్‌పల్లిలో ధరలు రూ.7,850, మియాపూర్‌లో రూ.7,550గా ఉన్నాయి. కొల్లూరులో సగటు ధర రూ.6,400గా నమోదైంది. గత మూడేళ్లలో నార్సింగిలో ధరలు 48.6 శాతం, కొండాపూర్‌లో 36.4 శాతం, మియాపూర్‌లో 38.5 శాతం పెరగడం గమనార్హం.

## మార్కెట్ ట్రెండ్స్

ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరగకుండా స్థిరంగా పెరుగుతున్నాయి. ఏడాదికి సగటున 10 నుంచి 15 శాతం వృద్ధి కనిపిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలపై కఠిన చర్యల కారణంగా కొనుగోలుదారులు ఇప్పుడు రేరా అనుమతులు ఉన్న ప్రాజెక్టులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. నగరంలో నమోదవుతున్న రిజిస్ట్రేషన్లలో 65 శాతం వరకు 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల ఇళ్లు ఉన్నాయి. అంటే మధ్యస్థ విస్తీర్ణం గల ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని అర్థమవుతోంది. కొల్లూరు, మోకిల వంటి ప్రాంతాలు హైవే కనెక్టివిటీ కారణంగా పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భవిష్యత్తులో మంచి రాబడులు వచ్చే ప్రాంతాలుగా ఇవి గుర్తింపు పొందుతున్నాయి. మొత్తంగా చూస్తే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. కమర్షియల్ రంగంలో భారీ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ గ్లోబల్ కంపెనీల ప్రవేశం మార్కెట్‌కు బలాన్ని ఇస్తోంది. నివాస మార్కెట్‌లో కూడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐటీ రంగం విస్తరణ వల్ల డిమాండ్ కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు మరియు అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు కొనసాగితే రాబోయే దశాబ్దంలో హైదరాబాద్ ఆసియాలోనే ప్రముఖ కమర్షియల్ మరియు నివాస రియల్ ఎస్టేట్ కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.



# బాలీవుడ్‌లో మరో ఆఫర్

'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కీర్తి సురేష్. ఆ సినిమా ఫెయిల్యూర్‌గా నిలిచినా ఈ భామ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా కీర్తి సురేష్ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. రాజ్‌కుమార్ రావుతో కలిసి ఆమె 'రాఫ్తార్' అనే చిత్రంలో నటించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించనున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. షూటింగ్ ప్రారంభించామని, జూలైలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. విద్యా వ్యవస్థ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, ప్రేమకథకు కూడా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్‌లో కనిపిస్తుందని, బాలీవుడ్‌లో ఆమె కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చిత్రంలో నటిస్తున్నది.

## రూ. 950 కోట్లతో డబల్ డెక్కర్ ఫ్లైఓవర్

**మంత్రి కోమటిరెడ్డి**



**ఎల్బీనగర్, విశాలభారతి:** ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు రూ. 950 కోట్ల వ్యయంతో డబల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నామని, త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించనుందని రోడ్డు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హయత్ నగర్ లోని సాయిబాబా గుడి చౌరస్తా నుంచి జి స్కూల్ వరకు రూ. 10 కోట్ల తో చేపట్టనున్నపాత నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ , రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మెట్రో రైల్ తో కూడిన డబల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కేంద్ర మంత్రివర్యులు గడ్కరీ ని పలుమార్లు కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో పూర్తి స్థానికులు తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.200 కోట్లను ముందస్తుగా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ఢిల్లీకి వెళ్లి మెట్రో తో డబుల్ డెక్కర్ రోడ్డును సాంక్షన్ చేయించుకొని వస్తామని తెలిపారు. రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రోడ్ల విస్తరణ కోసం ఆర్ అండ్ బి తరపున ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోనే రూ. 400 కోట్ల నిధులను మంజూరు చేశామని పేర్కొన్నారు. హయత్ నగర్ నుంచి తారామతి పేట్ వరకు, కోహెడ ఫ్రూట్ మార్కెట్ రోడ్డు, ఇంజాపూర్ రోడ్డు తదితర రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి విస్తరణను కూడా ఎంపీగా ఉన్నప్పటి నుంచి పోరాడిమంజూరు చేయించానని పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని.. అంతేకాకుండా రూ. 10 వేల కోట్లతో విజయవాడ వరకు సర్వీస్ రోడ్ల ను కూడా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రేషన్ కార్డుల పంపిణీ తదితర సంక్షేమ పథకాలతో పేదల ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాలుష్యం బారిన పడిన మూసీని పునరుజ్జీవం చేపట్టడం ఆవశ్యకమని.. ఇల్లు కోల్పోయే వారికి ఎక్కడికక్కడ పునరావాసం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బస్సు చార్జీలు కూడా లేని ఆ పార్టీ నాయకులు.. అవినీతితో వేలకోట్ల ఎదిగారని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో నిధులన్నీ ఆంధ్రాకే తరలించే వారన్నారు. తెలంగాణ కోసం మధు యాష్కి, తాను సోనియాగాంధీకి వివరించి ఒప్పించామన్నారు. తెలంగాణ ఉద్యమంలో.. అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డిని సైతం ఎదిరించి రాష్ట్ర ఏర్పాటు కోసం మధుయాష్కి పోరాడారని మంత్రి వెంకట రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎండ్బీ శాఖ ఈఎన్సీ మోహన్ నాయక్ , నేషనల్ హైవే సీఈ ధర్మా రెడ్డి , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాలయ కమిటీల డైరెక్టర్లు, సేవాదళ్, , మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ, ఎస్సీ ఎస్టీ, బీసీ,మైనారిటీ, తదితర విభాగాల ప్రతినిధులు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు

## బిజేపిది ప్రజా వ్యతిరేక పాలన




**పాల్వంచ విశాలభారతి:** బిజేపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నదని దీనితో పేదరికం పెరిగిపోతున్నదని సిపిఐజాతీయ కార్యవర్గ సభ్యులు వశ్య పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. పాల్వంచలో నిర్వహించిన రెండు రోజుల పాటు నూతనంగా ఎన్నికైన కార్పోరేటర్లు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు, సర్పంచ్లు. ఉప సర్పంచ్ల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకులుగా సిపిఐ పార్టీ తరుపున ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎలాంటి మచ్చలేకుండా అవినీతికి పాల్పడకుండా ఆ పరిస్థితి రాకుండా నికరంగా ప్రజా పాలన అంటే ఇది అని చెప్పటానికి నిదర్శనంగా మీ పాలన కొనసాగించాలని కాంక్షించారు. దేశంలో బిజేపి ప్రభుత్వం మతాలు, కులాల మధ్యన చిచ్చులు పెడుతూ తిరిగి గెలవాలని ప్రయాత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. మత మౌఢ్యానికి వ్యతిరేకంగా ప్రజా స్వామితాయుతమైన ప్రజలను సమీకరించి బిజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులపై మరింత బాధ్యత ఉందని దానిని నెరవేర్చటానికి అహర్నిషలు కష్టపడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులపై మరింత గురతర బాధ్యత ఉందన్నారు. ఒకవైపు కుటుంబ భారం, ఎన్నుకొన్న ప్రజల సమస్యల పరిష్కారం మరోవైపు ఉంటుందని ఈ రెండింటిని సమన్వయం చేసుకొంటూ, ముందుకు సాగాలని సూచించారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్తో మరిన్ని పదవులు మనకు వచ్చే అవకాశం ఉందని వాటి బాధ్యతలను సైతం సమర్ధవంతంగా నిర్వహించటానికి మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రజలు మనపై నమ్మకంతో మనల్ని ఎన్నుకొన్నారని వారి నమ్మకాన్ని నిలబెడుతూ పాలన సాగించటానికి మీ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని వాటిపై పట్టు పెంచుకోగలిగితే రాజకీయాలలో, ప్రజా సేవలో రాణిస్తారని అన్నారు. కావునా మహిళా ప్రజాప్రతినిధులు తమ విధులపట్ల జాగ్రత్తగా ఉంటూ నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. అప్పుడే ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకొంటారని తెలిపారు. మరోసారి అవకాశం వెతుక్కుంటూ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీ తరుపున ఎన్నికైన మీరు పార్టీ విస్తరణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికై అహర్నిశలు పాటుపడాలన్నారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

- **జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,740 మంది విద్యార్థులు**
- **12,701 మంది విద్యార్థులు హాజరు.. 39 మంది విద్యార్థులు గైహాజరయ్యారు**



**భద్రాద్రి ప్రతినిధి: విశాలభారతి:** జిల్లాలో పదవ తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం పాల్వంచ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించబడుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులకు గాను 209 మంది హాజరుకాగా, ఒకరు గైహాజరయ్యారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరుకాగా, నలుగురు గైహాజరయ్యారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,740 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 12,701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 12,720 మందికి గాను 12,687 మంది హాజరుకాగా, 33 మంది గైహాజరయ్యారు. అలాగే ప్రైవేట్ అభ్యర్థుల్లో 20 మందికి గాను 14 మంది హాజరుకాగా, 6 మంది గైహాజరయ్యారు. జిల్లాలో మొత్తం హాజరు శాతం 99.74 శాతంగా నమోదైంది.

## ఫుడ్ పాయిజన్ ఘటనపై చర్యలు

- **డిప్యూటీ వార్డెన్, హెచ్ఎం సస్పెన్షన్**
- **కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థత**
- **నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశం**

**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు పట్టణంలోని బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై జిల్లా కలెక్టర్ అంకిత్ కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులుగా భావిస్తూ డిప్యూటీ వార్డెన్ మరియు హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. గత ఆదివారం రాత్రి హాస్టల్‌లో భోజనం చేసిన అనంతరం విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో బాధపడిన విద్యార్థినులను వెంటనే మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మొత్తం ఇరవై నాలుగు మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు కారణం హాస్టల్‌లో తయారు చేసిన కలుషిత ఆహారమేనని ప్రాథమికంగా తేలింది. కనీస ఆహార నియమ నిబంధనలు పాటించకపోవడం, నాణ్యమైన ఆహారం అందించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్, హెడ్ మాస్టర్‌లను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన మరియు పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అన్ని హాస్టళ్లలో ఆహార నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.